అక్టోబర్ 2015

గాంధీ జయంతి శుభాకాంక్షలతో

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక   వెల రూ.25/-





సంపుటి: 1 సంచిక: 6 పుటలు: 68 విడి ప్రతి వెల: 25 అక్టోబరు 2015

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhrapradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
(Postal Registration No: See wrapper)

సంపాదకులు: నారాయణ శర్మ

గౌరవ సలహాదారు: యు. సుబ్బరాజు

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు : 9491870753

వీరాంజనేయులు : 7799260684

ఫైనార్ట్స్ చదువుతున్న ఇతర మిత్రులు కూడా.

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

కె. మల్లికార్జున: 9000453887



విషయ సూచిక

ముందుమాట

స్వచ్ఛ భారత్... సంపాదకీయం... 4

ధారావాహిక...

నీతి చంద్రిక... 6

పిల్లలు రాసిన కథలు

అభ్యాసం...పూజ... 12

చదువా, ఆటా?...ధన్య... 16

కంపు పిల్లాడు...ఆకాష్... 21

పట్టుదల....అనూష... 24

పెద్దల మాట...లక్ష్మి సుమిత్ర... 27

పిండికొద్దీ రొట్టె....శ్రీ విద్య... 31

ఎలుకల బెడద...నవిత... 34

పుట్టినరోజు బహుమతి...ఆశ... 37

చిలకల ముగ్గు...రేణుక...... 39

పెద్దలు రాసిన కథలు

భోజన ప్రియుడు...సిరి... 41

పిల్లల విజయం...హైమావతి... 46

శ్రవణుడి కథ...కృష్ణ మూర్తి... 51

ఏం జరిగింది...అఖిల్... 57

అవీ-ఇవీ

బొమ్మకు కథ రాయండి...చి॥ శ్రీమతి... 30

పదాల్ని వెతికి పట్టుకోండి...కొత్తపల్లి... 63

పదరంగం...సిరి... 64



ముఖ చిత్రం: పచ్చని గణపతి

చిత్రకారుడు: అడవిరాముడు

78

స్వచ్ఛ భారత్

దక్షిణాఫ్రికాలో నల్ల జాతివారికి ఎలాంటి హక్కులూ ఉండేవికావు. "మమ్మల్ని కూడా సమానంగానే చూడాలి" అని అక్కడ గొడవ మొదలుపెట్టాడు గాంధీ. ఆయన పోరాటానికి నేటాలులోని భారతీయులు అనేకమంది మద్దతు పలికారు.

ఆ సమయంలో భారతదేశం బ్రిటిష్‌వారి చేతుల్లో ఉండింది. "మాకు హక్కులు ఇవ్వాలి" అని మీటింగులు పెట్టేవాళ్ళు కాంగ్రెస్ నాయకులు. "దక్షిణాఫ్రికా భారతీయుల పోరాటానికి కాంగ్రెస్ మద్దతు బాగుంటుంది" అనుకున్నాడు గాంధీ. కలకత్తాలో జరుగుతున్న కాంగ్రెస్ మహాసభల్లో దక్షిణాఫ్రికా గొంతుని వినిపించాలని ఉత్సాహంగా ఇండియాకు వచ్చాడు.

కాంగ్రెస్ మహాసభ ఓ పెద్ద బహిరంగ స్థలంలో జరుగుతూ ఉండింది. సభల్లో పాల్గొనేందుకు దూరదూరాల నుండి ఎవరెవరో మహా నాయకులు వచ్చి ఉన్నారు. వారందరి మధ్యా పిట్టలాంటి గాంధీని ఎవ్వరూ పట్టించుకోలేదు.

సభ మొదలయిన కొద్దిసేపటికే గాంధీ ముక్కులు పనిచేయటం మొదలుపెట్టాయి: ఏదో కంపు! మరుగుదొడ్ల కంపు!!

సభ కోసం తయారు చేసిన మరుగుదొడ్లు ఎంత ఘోరంగా ఉన్నాయో చెప్పలేం. కొందరు సభ్యులైతే తమ గదుల ముందే దొడ్డికి పోయారు. వాళ్లకి అడ్డు లేదు. సభల కోసం వచ్చిన వాలంటీర్లను గాంధీ అడిగాడు- "చాలా కంపుగా ఉంది. మరుగుదొడ్లే అనుకుంటాను. అసౌకర్యం కదా? ఏమైనా చేరాదూ?" అని.

"ఓయ్ ఇది మా పని కాదు- పాకీ వాళ్ల పని అది" అన్నారు వాళ్లు.

సభలో మాట్లాడేందుకు ఇంకా గాంధీ వంతురాలేదు. చాలా మంది వ్యక్తులు వేదికనెక్కేందుకు పోటీ పడుతున్నారు. అందరూ చెప్పేవాళ్లే తప్ప, వినేవాళ్ళు లేరు.

సామాన్యంగా గాంధీ సమయాన్ని వృథా చేసుకోడు. ఆ రోజుల్లో ఆయన సూటూ బూటూ

వేసుకొని దర్జాగా ఉండేవాడు. అయినా అప్పటికప్పుడు చాట-పరక చేత పట్టుకొని, సభ కోసం కట్టిన మరుగుదొడ్లను అన్నింటిని పూర్తిగా శుభ్రం చేశాడు. సభకు వచ్చిన వాళ్లంతా ఆయన చేస్తున్న పనిని ఆశ్చర్యంగా చూశారు- కానీ ఒక్కరు కూడా ఆయనకు సహాయం చేసేందుకు ముందుకురాలేదు!



తర్వాత అనేక సంవత్సరాలకు- అదే గాంధీజీ కాంగ్రెస్‌కు దారి చూపించే వెలుగు దివ్వె ఐనాడు, శక్తివంతుడైన నాయకుడిగా ఎదిగాడు. అప్పుడిక కాంగ్రెస్ సభలలో "మరుగుదొడ్ల పరిశుభ్రతా బృందాలు" తయారయ్యాయి.

ఆ రోజుల్లో అంటరానితనం ప్రబలంగా ఉండేది. 'పరిశుభ్రత' అనేది కేవలం నిమ్న జాతులకే ఉద్దేశించిన పనిగా ఉండేది. గాంధీ చేసేటప్పటికి, అట్లాంటి పనులను కూడా చాలా ఇష్టంగా చేశారు, గాంధీ అనుయాయులు. తర్వాత ఒకసారి హరిపురంలో జరిగిన కాంగ్రెస్ సభల్లో ఏకంగా 2000 మంది టీచర్లు, విద్యార్థులు మరుగుదొడ్లను శుభ్రం చేశారు!

"మురికిని, గలీజుని శుభ్రం చేయడం ఒక పవిత్ర కార్యం. పవిత్ర కార్యాన్ని నెరవేర్చేవాళ్ళు అసలు అంటరానివాళ్లు ఎలా అవుతారు, భగవంతుని బిడ్డలౌతారు గాని?!" అని గట్టిగా నమ్మాడు గాంధీ.

ఒక్క టాయిలెట్లలోనే కాదు- మన జీవితపు అన్ని రంగాలలోనూ పేరుకుపోయిన మురికిని, చెత్తను ఏరిపారేయటం అసలు ఎవరికి వాళ్ళుగా, మనందరం ఎప్పటికీ చేస్తూ ఉండాల్సిన పని. ఏమంటారు?

గాంధీ జయంతి శుభాకాంక్షలతో

కొత్తపల్లి బృందం





నీతి చంద్రిక

చివరి భాగం



నెమలి రాజుగారి మాటలు విని దూరదర్శి అన్నది- " ప్రభూ! నేను 'యుద్ధం వద్దు- సంధి చేసుకుందాం' అనటానికి అనేక కారణాలు ఉన్నాయి. ఒకటి, మన సైన్యంలో పేరుగాంచిన యోధులు అనేకమంది మొన్నటి యుద్ధంలో స్వర్గస్తులయ్యారు. ఇక బ్రతికి ఉన్నవాళ్లలో కూడా చాలా మంది శరీరాల నిండా గాయాలతో, యుద్ధానికి పనికి రానట్లు ఉన్నారు. ప్రస్తుతం ఎవ్వరికీ శక్తి లేదు. ఇట్లాంటి శక్తి లేనివాళ్లను వెంట బెట్టుకొని పోయి, 'మేమే శూరులం' అని శత్రువుతో పోరాటానికి దిగితే కష్టం. మనవాళ్లు తమ శక్తికి మించి పోరాటం చేసినా సరే, చివరికి మనకు భంగపాటు తప్పదు.

ఇక, 'మన శత్రురాజు మహాబలుడు ఈ సమయంలోనే యుద్ధానికి ఎందుకు పూనుకున్నాడు?' అనేది కూడా కొంత ఆలోచించాలి. అతను యుద్ధానికి దిగింది హంసరాజు మంత్రి సర్వజ్ఞుడి ప్రేరేపణ చేతనే తప్ప, సొంత ఆలోచనవల్ల కాదు. "గతంలో నాకు అవమానం జరిగింది; ఇప్పుడు దానికి తగిన ప్రతీకారం సాధించుకుంటాను' అనే కోరిక కూడా దానికి కొంత తోడై ఉండవచ్చు- కానీ, తన స్నేహితుడైన హిరణ్యగర్భుడి మనోరథం నెరవేరితే, ఇతను కూడా సంతృప్తి చెంది తన నగరానికి తిరిగి పోతాడు- సందేహం లేదు. అందుచేత మనం ఇప్పటికైనా హంసరాజు హిరణ్యగర్భుడిని మంచి చేసుకొని, సమాధాన పరచుకోవటం అవసరం.

అందుకని, ముందుగా హంసరాజు దగ్గరికి మన దూత ఒకడు బయలుదేరి పోవాలి. అట్లా వెళ్లిన దూత పనిని నెరవేర్చుకొని మళ్లీ మనల్ని చేరుకొనే లోపలే ఈ మహాబలుడి సైన్యం వల్ల అపాయం రాకూడదు- అందుకని ఇప్పటికిప్పుడు మరొక రాయబారిని మహాబలుడి దగ్గరికి పంపాలి. అట్లా చేస్తే అంతా మనకు అనుకూలంగా అరుగుతుంది" అన్నది. నెమలి రాజు కూడా "అంతే" అని అంగీకరించాడు.

వెంటనే మంత్రి దూరదర్శి రాజుగారి అనుమతితో అరుణముఖుడిని పిలిపించింది. ఏమేం చెప్పాలో అతనికి అర్థమయ్యేట్లుగా చెప్పి పలికించింది. 'కార్యం నెరవేర్చుకొని రా' అని పంపించింది.



చిలుక అరుణముఖం కూడా సరైన దుస్తులు ధరించింది; నగరం బయట వనంలో శత్రువులు విడిది చేసి ఉన్న స్థలానికి వెళ్లింది. అక్కడి కాపలాదారులకు తాను వచ్చిన పనిని వివరించింది. సైనికులంతా గుంపులు గుంపులుగా తనను చూస్తుండగా పోయింది; వనం మధ్యభాగంలో ఒకచోట, చందన వృక్షాల

సమీపంలో, ఓ పొదరింట్లో విడిదిచేసి ఉన్న మహాబలుడిని సందర్శించింది. ఆ రాజుకు, మర్యాద పూర్వకంగా నమస్కరించింది.



అతని ఆజ్ఞానుసారం దగ్గరగా ఒక ఆసనం మీద కూర్చొని చేతులు జోడించి అన్నది- "ప్రభూ! జంబూ ద్వీపానికి అధినాధులైన చిత్రవర్ణ మహారాజుల వారు తాముగా ప్రభువులవారికి వినిపించమన్న మాటల్ని విన్నవించు-కుంటాను; చిత్తగించగలరు:

"ఇరుగు పొరుగు దేశాలకు ప్రభువులమై, మనలో మనం ఇట్లా కలహించుకోవటం, అకారణంగా ఒకరిపై ఒకరు కోపం పెంచుకోవటం, జాతి ధర్మాన్ని మరచి, ఇతరులు మనల్ని వేలెత్తి చూపే విధంగా ప్రవర్తించటం మంచిదికాదు. మనం ఐకమత్యంగా ఉంటూ, స్నేహంతోటీ, సోదరభావంతోటీ మెలగితే మూడు లోకాలూ కలిసి వచ్చినా మన వైపుకు కన్నెత్తి చూడగలరా?"

"గతంలో ఏ విధి వ్రాత వల్లనో మన మనసులలో కోపం అనే అగ్ని పొడజూపింది. నిష్కారణంగానే అది మెల్లమెల్లగా రగులుకొని, ప్రజ్వరిల్లింది. మన మనస్సులో కోపాలను కాపురం ఉండనివ్వటం అనేది మనిద్దరికీ క్షేమంకరం కాదు. 'ఇకపైన మనం ఇద్దరం ఒకరి పట్ల ఒకరం స్నేహ భావం అవలంబించి, మీరు ఆడిన మాట మేము, మా మాట మీరు చెల్లించుతూ కలిసి ఉండటం మేలు'- అని మా అభిప్రాయం. కర్పూర ద్వీపాధీశుడైన హిరణ్యగర్భుడు మనకు ఇద్దరికీ ప్రాణమిత్రుడిగా ఉండదగినవాడు. అతని రాజ్యాన్ని అతనికే ఇచ్చామని తెలియజేస్తూ, 'మాకు స్నేహితుడిగా మెలగవలసినది' అని కోరుతూ, ఈ రోజే దూతను పంపాను"

అని చెప్పి ఊరుకున్నది అరుణముఖం. మహాబలుడు కూడా కొంతసేపు

ఆలోచించాడు. తన సైన్యం కూడా ప్రయాణపు బడలికలో ఉన్నది. అందువల్ల, వచ్చిన పని తనకు అనుకూలంగానే ముగిసే లక్షణాలు కనిపించటం చేత, 'సంధి చేసుకోవటమే ఇప్పటికి మేలు' అని నిశ్చయించాడు; పూర్వపు శతృత్వాన్ని వదిలి సంధికి అంగీకరించాడు. ఆవిధంగా మహాబలుడికి, చిత్రవర్ణుడికి 'కపాలసంధి' (అంటే ఇరుపక్షాలు సమాన లాభనష్టాలతో చేసుకున్న సంధి) కుదిరింది.

అటుపైన చిత్రవర్ణుడు మంత్రి దీర్ఘముఖుడితో చర్చించి, హంసరాజు హిరణ్యగర్భుడి పేర ఒక లేఖ వ్రాయించింది. ఆ లేఖను తీసుకొని-పోయి, హంసరాజుకు ఇచ్చి, అతనితో తాను చెప్పిన విధంగా మాట్లాడి, మెప్పించి, పని నెరవేర్చుకొని వచ్చేందుకు ఎవరు తగిన వారు...? 'అరుణముఖుడే' అని నిశ్చయిం-చుకున్నది. "నువ్వే ప్రయాణం అయివెళ్లు. త్వరగా తిరిగి రా" అని దాన్ని కర్పూరద్వీపానికి పంపింది.

"అటుపైన అరుణముఖుడు వెనక్కి తిరిగి రావటం కోసం ఎదురుచూస్తూ, రోజులు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నది.


ఇక అక్కడ అరుణముఖుడు కొన్ని రోజుల ప్రయాణం తర్వాత కర్పూరద్వీపాన్ని చేరుకొన్నది. రాజధానికి పోగానే ముందుగా మంత్రి సర్వజ్ఞుడిని కలిసి, తాను వచ్చిన పనిని తెలియజేసింది.



సంగతి వినిన సర్వజ్ఞుడు సంతోషించి, దాన్ని వెంటబెట్టుకొని హిరణ్యగర్భుడు రహస్యంగా నివసిస్తున్న తావుకు తీసుకొని పోయింది. ఆ సమయానికి హంసరాజు తనకు ఇష్టమైన వారితో ముచ్చట్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నది. అరుణముఖం హంసరాజును చూసి, నమస్కారపూర్వకంగా తనను తాను

పరిచయంచేసుకొని, చక్కగా, మేలు కూర్చేదానిలాగా మాట్లాడింది.

"జంబూద్వీపానికి ప్రభువైన చిత్రవర్ణులవారు తమరి సుగుణాలను అనేకమంది ప్రశంసించగా విని, సంపూర్ణ హృదయంతో మెచ్చుకొన్నారు. ప్రభువులవారితో స్నేహాన్ని కోరి, నన్ను ఇక్కడికి పంపించారు.



ఈ నాటినుండి తమరు ఎప్పటిలాగే కర్పూరద్వీప రాజ్యాధికారాన్ని స్వీకరించాలనీ, అద్భుతంగా పరిపాలించాలనీ, చిత్రవర్ణ మహారాజుల వారితో స్నేహ సౌహార్దాలను అనుభవించాలనీ వారి కోరిక" అని లేఖను చేతికి ఇచ్చాడు. దానిని తీసుకొన్న హిరణ్యగర్భుడు మంత్రి సర్వజ్ఞునికేసి చూశాడు. ఇద్దరూ కలిసి కొద్దిసేపు ఆలోచించాక, రాజుగారు స్వహస్తాలతోటే తగిన జవాబు రాసి, తన రాయబారి అయిన ధవళాంగుని చేతికి ఇచ్చి, "ధవళాంగా! నువ్విప్పుడే యీ అరుణ-ముఖునితో కలిసి జంబూ ద్వీపానికి పో. అక్కడ చిత్రవర్ణ మహారాజుల వారిని దర్శించుకొని, తగిన మంచి పలుకులతో వారిని మెప్పించి, యీ లేఖను వారికి ఇచ్చిరా" అని చెప్పింది. అరుణముఖాన్ని కూడా తగిన విధంగా గౌరవించి, చెప్పవలసినవన్నీ చెప్పి పంపించింది.

ధవళాంగుడు, అరుణముఖుడు ఇద్దరూ ఒకరితో ఒకరు స్నేహంగా మాట్లాడుకుంటూ, మార్గాయాసం తెలీకుండా ఎగిరిపోయి, కొన్ని రోజులకు జంబూద్వీపం చేరారు. ఆ సమయానికి చిత్రవర్ణుడు కొలువు తీరి ఉన్నాడు. వీళ్లిద్దరూ ఆయన పాదాలను దర్శించుకొని, హంసరాజు సందేశాన్ని సమస్తం నివేదించారు. ఆ వెంటనే మహాబలుడు కూడా 'స్నేహితుడి పని పూర్తయింది గదా' అని సంతోషించి, చిత్రవర్ణుడి ఆతిథ్యాన్ని స్వీకరించి, సంతోషంగా తన సైన్యంతో సహా స్వదేశానికి వెళ్లాడు.

ఆనాటి నుండి మహాబలుడు, చిత్రవర్ణుడు, హిరణ్యగర్భుడు ఒకరికి ఒకరు గాఢమైన మిత్రులై, ఒకరి క్షేమ సమాచారాలు ఒకరు ఉత్తరాల ద్వారా కనుక్కుంటూ, చిరకాలం సుఖంగా రాజ్యపాలన చేశారు"

అని విష్ణుశర్మ 'సంధి' తంత్రాన్ని సంపూర్ణంగా చెప్పి, "మీరు కూడా ఇతర రాజులు అందరితోటీ సంధి చేసుకొని, ఐకమత్యం పెంచుకొని, సుఖంగా ఉండండి" అని ఉపదేశించాడు.

రాజకుమారులు పంచతంత్రాన్ని పూర్తిగా విని, సంతోషించి "ఆర్యా! తమరి దయవల్ల అజ్ఞానం అనే చీకటినుండి వెలువడి, జ్ఞానం అనే సూర్యుడిని సందర్శించగలిగాం!" అని విష్ణుశర్మను స్తుతించారు.


ఆ విధంగా నీతిని, ధర్మాన్ని గ్రహించి జ్ఞానవంతులైనారు రాజకుమారులు. వాళ్లను వెంటబెట్టుకొని పోయి, సుదర్శన మహారాజుకు అప్పగించాడు విష్ణుశర్మ.

కుమారులు జ్ఞానవంతులు అయినందుకు సంతోషించిన సుదర్శనుడు విష్ణుశర్మను అనేక విధాలుగా ప్రశంసించి, సన్మానించాడు; ఒక అగ్రహారాన్ని బహుమతిగా ఇచ్చాడు. విష్ణుశర్మ ఆ బహుమతులను అన్నింటినీ స్వీకరించి, సంతోషంగా తన ఇంటికి తిరిగి వచ్చాడు.



(ముగిసింది)

పంచతంత్రాన్ని ఐదవ శతాబ్దపు 'విష్ణుశర్మ' మొదట సంస్కృతంలో ఐదు భాగాలుగా రచించాడు. తర్వాత 14 వ శతాబ్దంలో 'నారాయణుడు' అనే కవి ఆ పంచతంత్రాన్నే, 'హితోపదేశం' అనే పేరుతో నాలుగు భాగాలుగా సంస్కృతంలో తిరగరాశాడు. పరవస్తు చిన్నయసూరి 'నీతి చంద్రిక' ఆ హితోపదేశాన్నే అనుసరించింది. అయితే, హితోపదేశంలోని మొదటి రెండు భాగాలు: "మిత్రలాభం, మిత్ర భేదం" మటుకు ఆయన అనువదించగలిగాడు. మిగిలిన రెండు భాగాలు- "విగ్రహం, సంధి"- వీటిని కందుకూరి వీరేశలింగంగారు తెలుగులోకి మార్చారు. అయితే వీళ్ళిద్దరి శైలి కూడా, సహజంగానే, ఆనాటి భాషా నియమాలను అనుసరించింది; ఈనాటి వారికి- ముఖ్యంగా పిల్లలకు- కొరుకుడు పడనట్లుగా ఉండింది. 'దాని పూర్తి పాఠాన్ని సరళీకరించి అందిస్తే తెలుగు పిల్లలకు ఉపయోగం కదా' అని కొత్తపల్లి అరవై సంచికల క్రితం ఈ పనిని మొదలు పెట్టింది. ఇన్నాళ్ళకు అది ముగిసింది. కొత్తపల్లి వెబ్సైటులో ఏ సంచికకు ఆ సంచికగా దీని పూర్తి పాఠాన్ని చదువుకోవచ్చు; ఎవరికి వారు దీన్ని ప్రింటు చేసుకోవచ్చు. మళ్ళీ మళ్ళీ చదువుకోవచ్చు. ఇది ఇక పూర్తిగా మీదే!




అభ్యాసం

సేకరణ: ఐ. పూజ, 8 వ తరగతి, శాంతినికేతన్ విద్యాలయ, జహీరాబాదు, సౌజన్యం : మన లైబ్రరీ, చిత్రాలు : మోహన్, ఇంటర్మీడియట్, హైదరాబాదు.


చాలాకాలం క్రితం దేవగిరిలో వరదరాజు అనే పిల్లవాడు ఒకడు ఉండేవాడు. ఆరోజుల్లో తల్లిదండ్రులందరూ పిల్లలకు ఐదేళ్ళు రాగానే వాళ్లని గురుకులంలో చేర్చేవారు. పిల్లలు గురువుగారికి శుశ్రూష చేసుకుంటూ, ఆయన నేర్పే విద్యలు నేర్చుకునేవాళ్ళు. అట్లానే వరదరాజు కూడా ఐదేళ్లు రాగానే ఓ గురువుగారి ఆశ్రమానికి చేరుకున్నాడు.

గురువుగారు పాఠాలు చక్కగా చెప్పేవారు; పిల్లలందరూ బాగా నేర్చుకునేవాళ్ళు- కానీ ఎందుకనో, వరదరాజుకు మాత్రం ఆయన ఏం చెప్పినా తలకెక్కేది కాదు. పిల్లలంతా సంవత్సరానికోసారి పై తరగతికి వెళ్తుంటే, వీడు మాత్రం ముందుకు కదలకుండా ఒకటో తరగతిలోనే చాలా ఏళ్ళు ఆగిపోయాడు.



చివరికి గురువుగారు ఒకరోజున వరదరాజును దగ్గరకు పిలిచి, "నాయనా! నీకు చదువుకునే అదృష్టం లేనట్లున్నది. ఇంత శ్రమ పడినా చదువురాలేదంటే, అసలు ఇక శ్రమ పడవలసిన అవసరమే లేదేమో, ఆలోచించు. చదువుకోవటం నీవల్ల కాదు. కాబట్టి నువ్వు ఇక ఇంటికి వెళ్ళి, ఏదైనా పని చూసుకోవటం మంచిది" అని చెప్పేశారు.


వరదరాజు "సరేనండి" అని ఆయనకు నమస్కరించి, మిత్రులందరి దగ్గరా సెలవు పుచ్చుకొని, ఇంటికి బయలుదేరాడు. "ఇదిగో నాయనా, దారిలో తినేందుకు పనికి వస్తుంది" అని కొంత పేలపిండి మూట కట్టి ఇచ్చింది గురుపత్ని. వాడు దాన్ని తీసుకొని ఇంటికి నడవసాగాడు.



కొంత దూరం నడిచాక వాడికి బాధ మొదలైంది. "ఇప్పుడు ఇంటికెళ్ళి నా ముఖం ఎలా చూపించను? ఎవరికి, ఏమని చెప్పుకోను?" అని మొదలైన ఆ ఆలోచన ఎక్కడికెక్కడికో వెళ్ళిపోయింది. వాడి మనసంతా వికలం అయిపోయింది.

మధ్యాహ్నం అయ్యేసరికి వాడు చాలా

అలసిపోయాడు. నడినెత్తిన సూర్యుని వేడికి, తలలో ఆలోచనల వేడికి వాడు ఇక తట్టుకోలేకపోయాడు.




అంతలోనే వాడికొక చేద బావి కనిపించింది- బావి ముందు బిందెలు పెట్టుకునేందుకు గాను మంచి బండ ఒకటి ఉన్నది. చేదుకునేందుకు ఓ కొబ్బరి తాడు, బొక్కెన బావికున్న ఇనప చక్రానికి తగిలించి ఉన్నాయి. త్రాడు బాగా నలిగి పోయి అక్కడక్కడా తెగినచోట ముడిపడి ఉన్నది. బొక్కెన అన్ని వైపులనుండీ నొక్కులు పడి, దెబ్బలు తినీ తినీ 'అసలిది బొక్కెనేనా?' అన్నట్లున్నది.

త్రాడు రాపిడికి ఇనప చక్రం బాగా అరిగిపోయి తళతళా మెరుస్తున్నది. బావి ముందున్న బండ వాడుక వల్ల బాగా నున్నగా అయి ఉన్నది. దానిమీద బిందెలు పెట్టీ పెట్టీ ఒరుసుకొని పోయి అక్కడక్కడా గుంటలు పడి ఉన్నాయి- "ఇప్పుడు ఇక వీటిలో బిందెలు కుదురుగా కూర్చుంటాయి.." అనుకొని నవ్వుకున్నాడు వరదరాజు.

అక్కడ కూర్చొని పేలపిండి తింటుండగా వచ్చిన ఇంకో ఆలోచన వల్ల వరదరాజు జీవితం పూర్తిగా మారిపోయింది: "రాపిడి వల్ల ఏమేం జరిగినాయో చూశావా? బండరాయి కూడా అరిగింది; ఇనపచక్రం కూడా అరిగింది; కటిక రాయి మీద మెత్తటి బిందెల గుర్తులు పడ్డాయి.. మళ్ళీ మళ్ళీ రుద్దితే పాషాణం కూడా కరుగుతున్నది.. మళ్ళీ మళ్ళీ చదివితే నాకు మాత్రం చదువు రాకుండా పోతుందా? నేనెందుకు ఓడిపోయాను, ఎందుకు ఇలా పారిపోతున్నాను, నాకు చదువెందుకు రాదు?..." అని!

ఇక పేలపిండి తినలేదు వరదరాజు- ఎంత మిగిలితే అంత మూటకట్టుకొని, తన కళ్ళు

తెరిపించిన ఆ బావికి నమస్కరించుకొని, నీళ్ళు త్రాగి, వెనక్కి తిరిగి, సాయంత్రానికల్లా గురువుగారి ఆశ్రమానికి చేరుకున్నాడు.



అక్కడివాళ్లంతా వీడిని చూసి ఆశ్చర్యపోయారు. "నువ్వు ఇంటికి పోతానని బయలుదేరావు కదా, పోలేదా?" అడిగారు గురువుగారు. "త్రాడు ఒరిపిడికి రాయికూడా కరిగిపోయింది గురువుగారూ, నేను నిశ్చయించుకున్నాను- ఇప్పుడు ఇక దేన్నైనా మళ్ళీ మళ్ళీ చదువుతాను- నాకు చదువెందుకు రాదో చూస్తాను.

దయచేసి నాకు మరొక్క అవకాశం ఇవ్వండి. ఈసారి మిమ్మల్ని నిరాశ పరచను" అని ప్రాధేయపడ్డాడు వరదరాజు కళ్ళనీళ్ళతో.


గురువుగారికి అర్థమైంది- "ఇక వీడిని ఎవ్వరూ ఆపలేరు" అని. ఆయన వాడిని ప్రేమగా అక్కున చేర్చుకున్నారు.

తర్వాత నిజంగానే వరదరాజు గొప్ప పండితుడయ్యాడు. దేవగిరి రాజైన మహాదేవుని చేత "మహా మహోపాధ్యాయ" అని బిరుదు పొందాడు. పాణిని వ్రాసిన సంస్కృత సూత్రాలను వివరిస్తూ, 'లఘు సిద్ధాంత కౌముది' అనే ఉద్గ్రంథాన్ని రచించాడు. అది ఈనాటికీ ప్రామాణిక గ్రంథంగా మన్ననలందుతున్నది!

నిజంగానే, పట్టుదలతో సాధించలేనిది ఏమున్నది?



అనగననగ రాగమతిశయిల్లుచునుండు- తినగ తినగ వేము తీయనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన! విశ్వదాభిరామ వినురవేమ!



చదువా, ఆటా?

రచన: ధన్య, పదవ తరగతి, రిషీవ్యాలీ స్కూల్.




మదనపల్లిలో పల్లవి, అమర అనే ఇద్దరు పిల్లలు ఉండేవాళ్ళు. ఇద్దరిదీ ఒకే వయస్సు. ఇద్దరి ఇళ్ళూ ఒకే వీధిలో. అందుకని ఇద్దరూ చక్కని స్నేహితులు అయి ఉండాలి- కానీ కారు! ఇద్దరికీ అసలు ఎప్పుడూ పడేది కాదు.

పల్లవి ఎప్పుడూ చదువుకుంటూ ఉండేది. అమర ఎప్పుడూ ఆటలు ఆడుతూ ఉండేది. "ఎప్పుడూ చదువేనా?!" అని ముఖం విరిచేది అమర. "చదువురాని మొద్దు!" అని ఈసడించేది పల్లవి.

అయితే వీళ్ళుండే సందులోనే మరో పాప

ఉండేది. ఆ పాప పేరు అంజన. ఆ పాప పల్లవి దగ్గరికెళ్ళి చదువుకునేది; అమర దగ్గరికెళ్ళి ఆటలాడేది. ఇద్దరినీ కలిపేందుకు తనకు చేతయినంత ప్రయత్నించేది; కానీ పల్లవి, అమర ఇద్దరూ ఆ పాప మాటలు పట్టించుకునేవాళ్ళు కారు.



అట్లా చాలా ఏళ్ళు గడిచాయి. పల్లవి బాగా చదువుకొని చాలా పేరున్న న్యాయవాది అయ్యింది. అమరేమో చాలా పేరున్న క్రీడాకారిణి అయ్యింది. ఇద్దరూ ఒకే ఊళ్ళో ఉంటారు; కానీ ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. పల్లవి కనబడితే తల తిప్పుకొని వెళ్ళిపోతుంది అమర. అమర ఫొటో వచ్చిన పేపరు కూడా చదవదు పల్లవి.

అయితే ఒక రోజున పల్లవి కోర్టులో తన పని ముగించుకొని వస్తుంటే చక్కగా, పొందికగా, హుందాగా ఉన్న ఒకావిడ ఆమె దగ్గరికొచ్చి పలకరించింది. "నీ పేరు పల్లవి కదూ? ఇప్పుడు నువ్వు లాయరువా?" అని.

అకస్మాత్తుగా ఎదురయ్యేసరికి ఆమెను పల్లవి గుర్తు పట్టనే లేదు. "ఏయ్! నేను! అంజనను! గుర్తు పట్టలేదా? మీరుండే వీధిలోనే ఉండేదాన్ని; నీతో కలిసి చదువుకునేదాన్ని?!" అన్నదావిడ.

పల్లవి చాలా సంతోషంగా ఆమెను తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించింది- "ఏయ్! ఎన్నేళ్ళయింది, నిన్ను చూసి? ఇప్పుడు ఏం చేస్తున్నావు?" అన్నది.

నేను ప్రభుత్వోద్యోగం. నువ్వు? మంచి లాయరువైనట్లున్నావే?" అన్నది అంజన.

"పద, మా ఇంట్లో భోజనం చేద్దువు. అన్నం తింటూ మాట్లాడుకుందాం" అని అంజనను తమ ఇంటికి తీసుకుపోయింది పల్లవి.

మాటల సందర్భంలో అమర ప్రసక్తి వచ్చింది.

"అమర క్రీడల్లో బలే పేరు సంపాదించుకున్నది గదా? నాకు ఆ రోజుల్లోనే అనిపించేది, ఆ పాప బలే ఆడేది! మీరిద్దరూ ఒకే ఊళ్ళో ఉంటున్నారుగా, కలుస్తుంటారా, ఎప్పుడైనా?" అడిగింది అంజన.

"ఇదిగో, చూడు! నీకు తెలుసు కదా, మేము ఎప్పుడూ స్నేహితులం కాదు. నేను చక్కగా చదువుకునేదాన్ని. అది ఊరికే ఆటలాడి కాలం వృధా చేసే పిల్ల. మేమిద్దరం ఎందుకు కలుస్తాం? నేను తనతో మాట్లాడనే మాట్లాడను. అమె పేరే ఎత్తకు, నా దగ్గర!" విసురుగా అన్నది పల్లవి.

అంజన కొంచెం ఆశ్చర్యపోయింది. "ఇదేంటి, ఇంత పెద్దయ్యాక కూడా చిన్నపిల్లలాగా చికాకు?!" అనుకున్నది.

ఆ తర్వాత కొద్ది రోజులకు అమర ఎదురుపడింది అంజనకు. "ఏయ్! అమరా! కులాసానా? నన్ను గుర్తు పట్టావా?" పలకరించింది అంజన.

అమర తనని ఒకింతసేపు తేరిపార చూసి "వావ్! అంజన! ఏంటే, ఎక్కడున్నావు, ఏం చేస్తున్నావు, ఎలా ఉన్నావు?!" అంది సంతోషంగా.

"నాదా, గవర్నమెంటు పని. మరి నీ సంగతులేంటే, నువ్వేమో ఇప్పుడు గొప్ప క్రీడాకారిణివి కదూ? నీ పేరు పేపర్లో చూస్తుంటాను ఎప్పుడూ!" అన్నది అంజన.

"అవునే, ఆటలంటే నాకిష్టం- అప్పుడూ, ఇప్పుడు కూడాను. నా ఉద్దేశం ప్రకారం అసలు ఈ బడులు, చదువులు ఇవన్నీ అవసరమే లేదు. పిల్లల్ని వేధించటానికి తప్ప, ఈ చదువులు అసలు ఎందుకూ పనికి రావు" అన్నది అమర.

"అదేంటే అట్లా అంటావు? మన సందులో పాప- పల్లవి- చక్కగా చదువుకునేది గుర్తుందా, అది ఇప్పుడు గొప్ప లాయరు అయ్యింది!" అన్నది అంజన.

అమరకు చటాలున కోపం వచ్చేసింది. "దాని పేరు ఎత్తకు! అది, దాని చదువు! లోకం ఏమాత్రం తెలీదు దానికి. ఎప్పుడూ చదివి చదివి దాని కళ్ళు, ఒళ్ళు ఎలా తయారయ్యాయో చూశావా?" అన్నది.

"ఓహో! వీళ్ళిద్దరూ ఇంకా పిల్లల్లాగే

ఉన్నారనమాట. వీళ్లని కలిపే విధానం ఒకటి ఏదైనా కనుక్కుంటే బావుంటుంది" అని నవ్వుకున్నది అంజన.

"నేను మటుకు నీదగ్గర నేర్చుకున్న ఆటల వల్ల నా ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుకుంటూనే ఉన్నాను" అన్నది అమరతో.

తర్వాతి రోజున హైకోర్టు జడ్జి వెంకట్రాం గారు పల్లవిని తమ ఇంట్లో ఏర్పాటు చేస్తున్న విందుకు ఆహ్వానించారు. అదే విధంగా మహిళా బ్యాట్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మగారు అమరను తమ ఇంట్లో విందుకు ఆహ్వానింవారు. విందులో పల్లవి, అమర ఒకరికొకరు ఎదురు పడ్డారు- "ఇదేంటి, నువ్విక్కడ?" అసంకల్పితంగా అన్నారు ఇద్దరూ, ఒకేసారి.

అప్పుడే అక్కడికి వచ్చిన జడ్జిగారు నవ్వుతూ "మన కొత్త పోలీసు కమిషనర్ గారికి మీరు మిత్రులట కదా? వారికి చదువులు, ఆటలు మీరే నేర్పారట!" అన్నారు.

"నాకు ఆటలంటే మహా చిరాకు. నేనెందుకు నేర్పుతాను?" అన్నది పల్లవి.

"నాకు చదువులంటేనే సరిపోదు-నేనెందుకు నేర్పుతాను?" అన్నది అమర.

అది విని పల్లవి రెచ్చిపోయింది. ఆవేశంతో అమర మీద అరిచింది-" ఏమి అనుకుంటున్నావే అమరా, నువ్వు? ఇంక చాలు ఆపు! నువ్వు అర్థం చేసుకునే సమయం వచ్చింది. చదువే అన్నింటికంటే ముఖ్యమైనది! ఆడుకోనక్కర్లేదు. తెలిసిందా?" అని.



వెంటనే అమర కోపం పట్టలేక అరిచింది-"చదువుకుంటే చదువురావచ్చేమో- కానీ ఆడుకోకపోతే అసలు తిన్నది ఎలా అరుగుతుంది?" అని.

"పల్లవీ, అమరా- నా మాట వినండి- చదువు, ఆట రెండూ మంచివే. ఎక్కువ ఆటా, తక్కువ చదువు పనికిరావు. అలాగే ఎక్కువ చదువు, తక్కువ ఆటా కూడా మంచిది కాదు. నాకు రెండింటినీ సమ పాళ్ళలో అందించారు మీరు. మీవల్లనే నేను ఈ రోజున పోలీస్ కమిషనర్ అయ్యాను. చదువులు, ఆటలు వేరు వేరు కాదు. సంపూర్ణంగా బ్రతికేందుకు రెండూ వేటికవి అవసరం. వాటిని విడదీయకూడదు. అట్లాగే మీరూ విడివిడిగా ఉండకూడదు. నాకోసమన్నా మీరు ఇద్దరూ కలవాలి. పిల్లల్లాగా కొట్లాడటం మానాలి" తమ వెనకనే నిలబడి అంటున్న పోలీస్ కమిషనర్ అంజనని చూడగానే అమర, పల్లవిల హృదయం కరిగింది.

ఇద్దరూ ఒకరినొకరు కౌగిలించుకుని, కంట తడి పెట్టారు. "అవునమ్మా! చదువులూ ఆటలూ రెండూ అవసరమే, కాదని ఎవ్వరూ అనలేరు. మీరిద్దరూ మంచివాళ్ళు. మిత్రులవ్వాలి అంతే, తప్పదు" అన్నారు జడ్జిగారు, పద్మగారు. పల్లవి, అమర ఇద్దరూ సిగ్గుతో తలలు వంచుకున్నారు.

పల్లవి అన్నది" అమరా నన్ను క్షమిస్తావా?" అని.

అమర అన్నది "నువ్వు నన్ను క్షమిస్తే, నేనూ నిన్ను క్షమిస్తాను" అని.

వింటూన్న అంజన సంతోషపడింది.



1 ఆ	ట	★	2 ట	3 మా	ట
ది	★	4 వ్యా	పా	రం	★
5 వా	6 ర	ధి	★	7 జా	8 మ
9 రం	సా	★	10 వే	న	వి
★	1 య	ము	డు	★	12 ర్మ
12 వ	నం	★	13 క	ల	లు

77వ పదరంగానికి సమాధానం

ఈసారి సరైన సమాధానం రాసింది ఒక్కరే!

యన్.గౌసియా,

8 జాస్మిన్, అరవింద స్కూల్,

కుంచనపల్లి.

ఈ పాపకు ఈ మాసపు కొత్తపల్లిని బహుమతిగా పంపుతున్నాం!



కంపు పిల్లాడు!

రచన: ఆకాష్, తొమ్మిదో తరగతి, రిషీ వ్యాలీ స్కూల్.

నా పేరు బంతి. నేను ఒక అబ్బాయిని. ఐదో తరగతి చదువుతున్నాను. నేను చాలా లావుగా ఉంటాను. చాలా బరువుగా కూడా ఉంటాను. బాగా గట్టిగా కూడా ఉంటాను. ఎంతో బద్ధకంగా కూడా ఉంటాను. నాకు ఇష్టం ఐనవి- నవ్వటం, పుస్తకాలు చదవటం, లెక్కలు చేయటం, అన్నింటికంటే మించి పుస్తకాలను స్టేపుల్ చేయడం.

నేను నల్లగా ఉండటం వల్ల మా మిత్రులందరూ నన్ను 'నల్ల పిల్లి' అని పిలుస్తారు. వాళ్ళు అట్లా పిలిస్తే నేనేమీ నొచ్చుకోను. నిజానికి నన్ను ఎవరైనా 'బంతీ' అని పిలవటం కంటే 'నల్ల పిల్లి' అని పిలవటమే నాకు ఇష్టం. నాకు పాములంటే భయం. పాములంటే అందరికీ భయమే, ఎలాగూ.

ఒకరోజున నేను నవ్వుతూ-నవ్వుతూ ఒక బల్లమీద పడ్డాను. వెంటనే అది కాస్తా

తుక్కు-తుక్కు అయిపోయింది. మా అమ్మ వచ్చి 'ఇదేంట్రా, ఇట్లా అయ్యింది?' అన్నది. 'ఈమధ్య బల్లల్ని గట్టిగా చేయట్లేదు- మరీ సున్నితంగా ఉంటే ఇట్లాగే కదా, అయ్యేది?! ఏమీ పరవాలేదులే ' అని నేను మా అమ్మను సముదాయించాను.

మరో నాడు రాత్రి- విద్యుత్తు పోయింది. అప్పుడు నేను లేచి, చీకట్లో కళ్ళు మూసుకొని నడిస్తే ఎలా ఉంటుందో చూద్దామను-కున్నాను. అయితే కాళ్ళు తుడుచుకునే పట్టాకు ఆ సంగతి తెలియలేదు. దాని మీద నా కాలు పడగానే, అది జారి గోడ వరకూ పోయింది. దాంతో నేను పోయి బీరువా మీద పడ్డాను. బీరువాలో సామాన్లు నా అంత బరువుగా లేవు కదా, అందుకని అది క్రింద పడిపోయింది. దానికో పెద్ద సొట్ట పడింది. "ఇదేంటిరా, ఇట్లా అయ్యింది?" అంది మా అమ్మ. "బీరువాను బలంగా చేయకపోతే ఇట్లాగే కదా, అయ్యేది?! ఏమీ పరవాలేదులే' అని నేను సముదాయించాల్సి వచ్చింది మళ్ళీ.

మా ఇంటి ముందరే ఒక డ్రైనేజ్ కాలువ ఉంది. కాలవలో మురికి నీళ్ళు ఆగి ఆగి పోతూ ఉంటాయి. కాలవ ప్రక్కన నిలబడి ఆ నీళ్లని చూస్తూ ఉండటం అంటే నాకు చాలా ఇష్టం.



అయితే నిన్న నేను అట్లా నిలబడి చూస్తూ ఉంటే ఒక ఈగ వచ్చి నా కాలి మీద వాలింది. నేను దాన్ని తరిమాను. అది మళ్ళీ వాలింది. నేను మళ్ళీ తరిమాను. అది మళ్ళీ వచ్చి వాలింది.

చివరికి నేను దాన్ని ఏడిపించాలని, అక్కడే నిలబడి డ్యాన్సు చేయటం మొదలు పెట్టాను. అంతలోనే ఏమైందో మరి, నేను

డ్రైనేజ్ కాలువలో తలక్రిందులుగా పడి ఉన్నాను. అక్కడే ఇరుక్కుపోయాను కూడా- బయటికీ రాలేను; లోపలికీ పోలేను. నన్ను చూసి ఎవరో "నల్ల పిల్లి కాలవలో ఇరుక్కుపోయింది" అన్నారు. అనటమైతే అన్నారు; కానీ ఎవ్వరికీ నన్ను బయటికి లాగేంత బలం లేకుండింది. అట్లా నేను రెండు గంటల సేపు అక్కడే ఉన్నాను. దాంతోటి ఊళ్లో ఉన్న అన్ని డ్రైనేజీ కాలువలు బ్లాక్ అయిపోయాయట. ఇళ్ళలో మురికి అంతా టాయిలెట్లలోంచి బయటికి ఉరికిందట. ఊరంతా కంపే.

అయితే ఒక వింత సంగతి ఉంది. ఊళ్లో జనాలంతా 'కంపు కంపు' అని మొత్తుకుంటూ ఉంటే నేను మాత్రం అదే కంపుని సువాసన అనుకొని పీలుస్తూ పోయాను. అది ఎలా జరిగిందో మరి, నాకు ఇంకా అర్థం కాలేదు. మీకేమైనా తెలుసా?



నవ్వులు!

ఏం పేరు?

ఎడిటర్: కవిత రాసి కింద బాల్ పెన్ను అని రాశారేంటి?

కవి: నా పేరుకు బదులు కలం పేరు పెట్టమని మీరే చెప్పారుగా.

ఏడవ తరగతి పిల్లలు, మోడల్ స్కూల్, సికెపల్లి.

గుండె పోటు!

డాక్టరు: మత్తు మందు ఇవ్వడానికి ముందే రోగి స్పృహ తప్పాడేంటి?

నర్సు: ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు చెప్పానంతే డాక్టర్!

ఏడవ తరగతి పిల్లలు, మోడల్ స్కూల్, సికెపల్లి.

దొంగ బుద్ధి!

రాధ: డాక్టర్ గారూ! మావారు ఉంగరం మింగారు!

డాక్టర్: కంగారు పడకండి! మత్తు మందు ఇచ్చి ఆపరేషన్ చేస్తాం.

రాధ: మత్తుమందు ఎందుకు, మావారిని మత్తులో ఉంచి ఉంగరం కాజేద్దామనా?

ఏడవ తరగతి పిల్లలు, మోడల్ స్కూల్, సికెపల్లి.



పట్టుదల

పేదరికాన్ని వ్యక్తిగత సమస్యగా చూసి, దానిలోంచి బయట పడ్డవాళ్ళు అనేకమంది ఉన్నారు. ఈ కథలో బాలుదీ అదే కోవ. అయితే మన సమాజంలో అసలు పేదరికం ఎందుకు ఉన్నది? కొందరు ధనవంతులు, కొందరు పేదలు ఎందుకు ఉన్నారు? వీటి వెనక ఉన్న సామాజిక కోణాలు ఏమిటి? సమాజానికి పట్టిన పేదరికపు పీడను వదిలించటం ఎలాగ? ఇవి అసలు ప్రశ్నలు...

రచన : అనూషా, తొమ్మిదవ తరగతి, మహీంద్రా అకాడమీ హైస్కూల్, జహీరాబాదు

సౌజన్యం : మన లైబ్రరీ, జహీరాబాదు.

లక్ష్మమ్మ-రామయ్యలకు ఒక్కడే కొడుకు. పేరు బాలు. లక్ష్మమ్మ, రామయ్య ఇద్దరూ కూలికి పోయేవాళ్ళు.

వాళ్లది చాలా పేద కుటుంబం. ఇంట్లో దరిద్రం తాండవం చేసేది. తాము తినేందుకు తిండి ఉన్నా, లేకున్నా బాలు మాత్రం బాగుండాలని ఆశించేవాళ్ళు తల్లిదండ్రులిద్దరూ. దాంతో వాడిని ఆ ఊరిలోనే ఉన్న కాన్వెంటులో చేర్చారు.

అయితే వాడికి ఐదేళ్ళు వచ్చేసరికి రామయ్య కాలం చేశాడు. లక్ష్మమ్మ ఒక్కతే ఎంతో కష్టపడి వాడిని అదే బడిలో మూడవ తరగతి


వరకు చదివించింది. ఇక ఆ తరువాత వాడిని ప్రైవేటు బడిలో చదివించే స్తోమత లేక, గవర్నమెంటు స్కూల్లో చేర్పించింది.

పాత బడిలో పిల్లలంతా చక్కగా ఇస్త్రీ చేసిన యూనిఫాములు వేసుకొని వచ్చేవాళ్ళు. ఇక్కడ పిల్లల బట్టలు చాలా మాసిపోయి, మురికి మురికిగా ఉండేవి. "ఎందుకమ్మా, ఇట్లా?" అని అడిగేవాడు బాలు. "అది ధనవంతుల బడి నాయనా! మనది పేదవాళ్ళ బడి!" అనేది లక్ష్మమ్మ.

రేషన్ షాపులో పేద ప్రజలకు చవక ధరలో సరుకులు అమ్ముతారు. లక్ష్మమ్మ నెల సరుకుల్ని ఎప్పటికప్పుడు రేషన్ షాపులోనే తీసుకునేది. ఆ దుకాణంలో పెద్ద పెద్ద వరసల నిండా జనాలు ఉండేవాళ్ళు. రవి గంటల తరబడి నిలబడేవాడు ఆ లైన్లలో.

ఒక్కోసారి కొత్తగా వచ్చిన వాళ్ళు కొందరు లైన్లోనే ముందుకెళ్ళి సామాన్లు తీసుకునేవాళ్ళు. "వీళ్ళెవరు, మనకంటే ముందు వెళ్తున్నారు?" అని అడిగితే "వాళ్ళు ధనవంతులు బాబూ, మనం పేదోళ్ళం ఆగాల్సిందే" అనేవాళ్ళు అందరూ. అట్లాంటి వాళ్లతో పోరాడలేక, వరుసలో కూడా వెనకపడి, బిక్కు, బిక్కు మంటూ నిలబడేవాడు రవి.

చివరికి వ్యాపారి తక్కువ తూకంతో ఇచ్చినా కూడా, 'ఇదేమి' అని అడగలేక, 'అదే మహాభాగ్యం' అని తీసుకెళ్ళేవాడు.



లక్ష్మమ్మ రవి ఇద్దరూ ప్రొద్దున్న నాలుగు గంటలకు లేచి, చన్నీటి స్నానం చేసి, గుడికి వెళ్లి, దర్శనం కోసం నిలబడేవాళ్లు. గంటల తరబడి నిలబడ్డా వీళ్ల లైను ముందుకు కదిలేది కాదు. అయితే వాళ్ల ప్రక్క వేరే వరసలో ఉన్న వాళ్ళు మాత్రం అలా వచ్చి

రాగానే దర్శనానికని ముందుకు వెళ్ళిపోయేవాళ్ళు- వీళ్లకేసి గర్వంగా చూసుకుంటూ. "అదేంటమ్మా! వాళ్లు మన తర్వాత కదా..." అని అడిగేవాడు బాలు.

"మనది ధర్మ దర్శనం బాబూ! వాళ్ళేమో డబ్బు ఉన్నవాళ్లు. ఎక్కువ డబ్బు పెట్టి టికెట్టు కొనుక్కుంటారు. 'స్పెషల్ దర్శనం' చేసుకుంటారు" అన్నది వాళ్ళ అమ్మ.

బళ్ళో పుస్తకాల సంచి చిరిగినప్పుడు కూడా ధనికులు-పేదలు అన్న తేడాను ఎదుర్కొన్నాడు బాలు. తోటి పిల్లవాడు ఎగతాళి చేస్తుంటే ఏమీ అనలేక గుడ్లలో నీరు కుక్కుకున్నాడు.

వీధి కుళాయిల దగ్గర నీటి కోసం కుక్కల్లాగా పోట్లాడుకునేటప్పుడూ అంతే. అట్లా ఒక్క చోట కాదు- అనేక చోట్ల; కండ బలం, నోటి బలం రెండూ లేక, గొడవలంటే భయపడి, అమ్మ చెప్పినట్లు అర్థించటమే తప్ప, అరవటం ఎలాగో- ఆజ్ఞాపించడం ఎలాగో తెలీక- ప్రతి విషయంలోనూ ధనిక-పేద వర్గ వివక్షను భరిస్తూ పెరిగాడు బాలు. రాను రాను అతనిలో ఆలోచన పెరిగింది. పేదరికం అంటే నిరసన మొదలైంది. 'డబ్బులుండాలి- లేకపోతే లాభం లేదు' అనిపించసాగింది.

"పేదరికపు బాధ పోవాలంటే ఏంచేయాలి?" అని ఆలోచించాడు. వాళ్లమ్మ చెప్పినట్టుగా బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించాడు.



ఉద్యోగంలో బాగా రాణించి, అటుపైన సొంత వ్యాపారం మొదలు పెట్టుకున్నాడు. ఒకప్పుడు ఏ అబ్బాయి అయితే తనని వెక్కిరించాడో అతన్నే తన అసిస్టెంటుగా పెట్టుకున్నాడు!



ఐకమత్యమే బలం!



పెద్దల మాట- చద్ది మూట

రచన: లక్ష్మీసుమిత్ర, 5 వ తరగతి, రిషీ వ్యాలీ స్కూల్.



అనగనగా ఒక ఊరిలో అలి అనే ఒక బాబు ఉండేవాడు. అతను చాలా అల్లరి చేస్తుండేవాడు. వాళ్ల అమ్మ ఎంత చెప్పినా వినేవాడు కాదు.

ఒక రోజు అలి వాళ్ళ అమ్మని అడిగాడు "అమ్మా! నేను ఇవాళ్ళ స్కూల్ అయిపోయాక సినిమాకి వెళ్ళొచ్చా?" అని.

"ఒద్దు అలీ! నీకు దారి తెలియదు. చీకటి పడితే తప్పిపోతావు!" అంది అమ్మ.

"లేదమ్మా! నాకు వెళ్ళాలని ఉంది. అది ఎంత గొప్ప సినిమానో తెలుసా, నీకు? బలే సినిమా

అట! పిల్లలంతా చూడాల్సిన సినిమానట! లలిత కూడా చూసింది!" అన్నాడు అలి.



"నేనే తీసుకెళ్తానురా, నిన్ను. రేపు నాకు పని ఉంది కదా, అందుకని ఇంకోరోజు ఎప్పుడైనా వెళ్దాం. నువ్వు చాలా మంచివాడివి కదా! నా మాట విను. ఒక్కడివే దారి తెలియకుండా వెళ్ళకూడదు- చాలా ప్రమాదం!" అంది అమ్మ.

"సరేలే" అన్నాడు అలి.

కానీ సాయంత్రం అయ్యేసరికి అలి అమ్మ మాట వినకుండా తనొక్కడే సొంతగా సినిమాకు వెళ్ళాడు!



సినిమాకు వెళ్ళేటప్పుడు ఏమీ కష్టం కాలేదు. సమస్య అంతా సినిమా అయ్యాక మొదలయింది. అక్కడినుండి తను ఇంటికి బయలుదేరేసరికే రాత్రి తొమ్మిది గంటలు అయ్యింది. అసలే కొత్త దారి- చీకటి! తనకీ దారి అంతగా తెలీదాయె! దాంతో దారి తప్పిపోయాడు. ఎటో వెళ్ళి పోయాడు. ఎంత నడిచినా ఇంటి జాడ లేదు. రోడ్లమీద ఒక్క మనిషి కూడా లేడు, అలీ తప్ప!

నడిచీ నడిచీ అలిసిపోయాక, వీధిలో ఒక మూల కూర్చుని ఏడవటం మొదలు పెట్టాడు అలి. "అమ్మ మాట వింటే బాగుండేది. అమ్మతో బాటు ఇంకొక రోజు ఎప్పుడైనా వెళ్ళి ఉంటే సరిపోయేది. ఇప్పుడు చూడు, చలి పుడుతోంది; ఆకలివేస్తోంది; భయం వేస్తోంది- ఇప్పుడు

ఏం చేయను?" అనుకున్న కొద్దీ ఇంకా ఇంకా ఏడుపు వచ్చింది.



అంతలో పోలీస్ ఆయన ఒకాయన అలి దగ్గరికి వచ్చి "ఎందుకు ఏడుస్తున్నావ్ అలీ?" అని అడిగాడు.

జరిగినదంతా చెప్పాడు అలీ.

"మరి అమ్మ మాట వినాలి కదమ్మా! ఇంత చిన్న బాబువి కదా, సొంతగా దూరాలు దూరాలు వెళ్తే ఎంత ప్రమాదం! అర్థమైందా? మరి ఇప్పుడు కళ్ళు తుడుచుకో, మీ ఇంటికి తీసుకెళ్తాను. అయినా మీ ఇల్లెక్కడ?" అడిగాడు పోలీసు.



అలీకి వాళ్ల ఇల్లు ఎక్కడ ఉందో కూడా తెలీదు! కనీసం వాళ్ల అమ్మ ఫోను నంబరు కూడా తెలీదు!

ఆ పోలీస్ నవ్వాడు. "చూశావా, అందుకనే పిల్లలు ఎప్పుడైనా వాళ్ల అడ్రసులు, ఫోను నెంబర్లు నోటికి నేర్చుకోవాలి. సరేనా?" అన్నాడు. "మీ అమ్మ నీకోసం ఎదురు చూస్తున్నది. నువ్వు ఇట్లా అల్లరి పని ఏదో చేస్తావనే ముందుగా చెప్పి నన్ను నీవెంటే సినిమాకి కూడా పంపించింది. ఎంత మంచి అమ్మో చూశావా?" అని అలీని వాళ్ళ ఇంటికి తీసుకువెళ్ళి విడిచిపెట్టాడు.

"అమ్మా! నన్ను క్షమించు నేను నీ మాట వింటాను" అన్నాడు. అమ్మ ఆనందపడింది. పోలీసాయనకు ధన్యవాదాలు చెప్పింది.




బొమ్మకు కథ రాయండి

చిత్రం : చి॥ శ్రీమతి, ఐదవ తరగతి, రిషీవ్యాలీ స్కూల్



పిల్లి రాజావారు ఎందుకనో యువరాణి గారి వెంట పడుతున్నారు. ఏం చెబుతున్నారు, ఎందుకు? ఇది చూస్తే మీకేదో కథ ఉందని అనిపిస్తున్నది కదా? చక్కని ఆ సొంతకథని మాకు రాసి పంపండి. ఓ కొత్తపల్లినీ, తాతగారిచ్చే బహుమతినీ కూడా సొంతం చేసుకోండి. మొదలు పెట్టండి మరి!





పిండి కొద్దీ రొట్టె

సేకరణ: టి. శ్రీ విద్య, తొమ్మిదవ తరగతి, పి.వి.ఆర్.జడ్.పి.హెచ్.స్కూల్, గుండువారిపల్లి, అనంతపురము జిల్లా.

విజయనగర సామ్రాజ్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆనాడు రాజు గారి పుట్టిన రోజు.

ఆనవాయితీ ప్రకారం ప్రతి ఏడాదీ పుట్టినరోజునాడు రాజుగారు ఏనుగు అంబారీ మీద నగర వీధుల్లో సంచారం చేస్తారు. మనసుకు తోచినట్లుగా ధాన ధర్మాలు చేస్తారు.

కృష్ణదేవులవారు మనసున్న ప్రభువు. ఎదుటివారి విద్వత్తును, వారి పాత్రతను అంచనా వేయటంలో ఆయనకు మరెవ్వరూ సాటిరారు.

ఆరోజున ఒక వింత జరిగింది. మహారాజుల వారు వైభవంగా ఊరేగుతూ పేట వీధిలోకి వచ్చారు. అక్కడ ఆయన కోసమే ఎదురు చూస్తూ నిలబడి ఉన్నాడొక బిచ్చగాడు. పేరు అచ్చయ్య. అచ్చయ్యకు ఏలాంటి రోగమూ లేదు; ఇంకా వయసు మీరలేదు.

వయసు మీరినవారికి, రోగులకు ప్రభువుల వారు అనేక ఉచిత భోజన సత్రాలు, వసతి క్షేత్రాలూఎలాగూ నిర్మించి ఉన్నారు. అచ్చయ్యకు బద్ధకం ఎక్కువ. పని చేయటం అంటే ఇష్టం లేదు. 'అడుక్కుతింటే చాలు కదా' అనుకునే వ్యక్తి.



ఆ నాడు ప్రభువుల వారు తనని గుర్తిస్తారనీ, తన జోలెను వెండితోటీ, బంగారు తోటీ నింపేస్తారనీ, తాను ఇక పని చేయనవసరం లేకుండా జీవితాంతం కాలుమీద కాలు వేసుకొని బ్రతకచ్చునీ కలలు కంటున్నాడు అచ్చయ్య.

అంతకు ముందే రాణి వాసం నుండి ఎవరో వచ్చి అతని జోలె నిండా అన్నం వేసి వెళ్లారు. కానీ అచ్చయ్యకు ఇప్పుడు కావలసింది అన్నం కాదు. బంగారం.

రాజుగారి అంబారీ అతని ముందుకు వచ్చింది. ఊరేగింపు చూసేందుకు వచ్చిన జనంతో తొక్కిసలాట మొదలయింది. అచ్చయ్య జనాన్ని తోసుకొని తోసుకొని అంబారీ దగ్గరగా వెళ్ళాడు- అన్నంతో నిండి ఉన్న తన జోలెను చూపిస్తూ "ధర్మం-ధర్మం!" అని అరిచాడు.

రాజుగారు అంబారీని ఆపమని సైగ చేశారు. అచ్చయ్య "ధర్మం చేయండి బాబు! ధర్మం చేయండి" అని అడుగుతూనే ఉన్నాడు.

రాజుగారు చిరునవ్వు నవ్వారు- "ముందు నాకు ఏమన్నా ఇవ్వు!" అని అడిగారు.

అచ్చయ్యకు చాలా కోపం వచ్చింది. "ఈ జనాలకే కాదు; ప్రభువుకూ తన జోలె నిండిందని అసూయేనన్నమాట! ఏం, కనీసం ఇవాళ్లనైనా తను కడుపునిండా తింటే వీళ్ళకేమి? తను అడుక్కున్నదాన్ని వీళ్లకు ఎందుకివ్వాలి అసలు?"

రాజుగారు అతనికేసే చూస్తున్నారు. అతని ఆలోచనల్ని ఆయన చదువుతున్నట్లున్నారు.

కొద్దిసేపటికి బిచ్చగాడికి నిరాశ మరింత ఎక్కువైంది. "తను ఏమైనా ఇస్తే తీసుకుంటారు తప్ప, రాజుగారు ఇక తనకు ఏమీ ఇవ్వరు" అని నిశ్చయించుకున్నాడు. తనకు ఏమీ ఇవ్వనివాడికి తను మాత్రం ఎందుకివ్వాలి?" అనుకున్నాడు. అయినా రాజుగారు చేయి చాపి అడుగుతున్నారు కనుక, తన జోలె నుండు ఒక అన్నం మెతుకు తీసి రాజుగారి వైపు విసిరాడు.

రాజుగారు ఆ మెతుకును అందుకొని, దానికేసీ- అన్నంతో నిండి ఉన్న అచ్చయ్య జోలె కేసీ చూస్తూ నవ్వారు. అంబారీ మీదినుండి దేన్నో తీసుకొని అచ్చయ్యకు అందేట్లు విసిరారు. అంబారీని ముందుకు నడిపారు.

కృష్ణదేవులవారి చేష్ఠ అర్థం కాలేదు అచ్చయ్యకు. అయినా ఒక్కమాటుగా ఎగిరి అందుకొని, 'అదేంటా' అని ఆత్రంగా చుశాడు దాన్ని.

అన్నం మెతుకంత బంగారం తునక అది!

తర్వాత కొద్ది సేపటికి మొదలైంది అచ్చయ్య బాధ- "అయ్యో! నేనెంత తెలివి తక్కువ వాడిని, జోలెలో ఉన్న అన్నాన్నంతా ఇచ్చి ఉంటే ఎంత బాగుండేది?" అని.



మంచి పద్యం

లావొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె; ప్రాణంబులున్
ఠావుల్ దప్పెను; మూర్ఛ వచ్చె; తనువున్ డస్సెన్; శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప ఇతఃపరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!

"ఓ దైవమా! నా బలం క్షీణించింది. ధైర్యం కోల్పోతున్నాను. ప్రాణాలు నిలుస్తాయో లేదో తెలీటం లేదు. మూర్ఛ వచ్చినట్లున్నది. నా శరీరం డస్సిపోయింది. భారంగా ఉంది. నువ్వు తప్ప నాకు ఇక వేరే దారి ఏదీ తెలీటం లేదు. నా మాట విని రా! నన్ను కాపాడు!"

-పోతన రాసిన ఆంధ్ర మహా భాగవతంలో మొసలికి చిక్కిన ఏనుగు



ఎలుకల బెడద

సేకరణ: కె. నవిత, తొమ్మిదవ తరగతి, జడ్.పి.హెచ్.స్కూల్. సి.కె.పల్లి

అనగా అనగా ఒక ఊళ్ళో ఓ రాజావారి గోదాం. అందులో ఎలుకల బెడద ఎక్కువైపోయింది. గోదాం అంటే తెలుసుగా? తినే సామానులన్నీ నిలువ ఉంచుకునే స్థలం అది. అక్కడ చేరినై, వందల కొద్దీ ఎలుకలు. ఆ ఎలుకలు గోదాంలో పెట్టిన వస్తువులన్నిటినీ పాడుచేస్తున్నాయి. బియ్యం బస్తాలను, పిండి బస్తాలను కొట్టేస్తున్నాయి. పప్పుల్లో పిల్లల్ని పెడుతున్నాయి.

దాంతో రాజావారికి చాలా కష్టం వేసింది. "ఏం చేస్తే బాగుంటుంది?" అని మంత్రుల్ని అడిగాడు.

ఎలుకలకు మందు దొరుకుతుంది ప్రభూ! అయితే అది ఆహారంలో కలిస్తే మటుకు చాలా ప్రమాదం" చెప్పారు మంత్రులు.

"మీకు తెలిసి ఎలుకల్ని తినే జంతువులేమీ లేవా?" అడిగాడు రాజు-"ఎలుకలు పోవాలంటే పిల్లుల్ని తెచ్చి పెంచుకుంటే సరి" అని తీర్మానించి చెబుతూ.

"భలే ఐడియా! చాలా బాగుంది!" అన్నారు అందరూ. "ఎలుకలు పోవాలంటే పిల్లుల్ని తెచ్చి పెడితే సరి!"

"సరే! అయితే పెద్ద పెద్ద పిల్లుల్ని తెచ్చి వదలండి" అన్నారు రాజుగారు.



పిల్లులు వచ్చాక ఎలుకల బాధ తప్పింది. కానీ రాను రాను పిల్లుల బెడద ఎక్కువయ్యింది. వందలకొద్దీ పిల్లులు- ఎక్కడ పడితే అక్కడ కక్కుతున్నాయి. దొడ్డికి పోతున్నాయి. వాసన.. "ఏం చేస్తే బాగుంటుంది?" మంత్రుల్ని అడిగారు రాజుగారు.

ఆ సరికి రాజుగారు ఏమనుకుంటున్నదీ మంత్రులకు అర్థమైపోయింది. ఆయన మనసులో మాట చెబితే మెచ్చుకుంటారు! "పిల్లుల్ని తరిమేయాలంటే కుక్కల్ని తెప్పించాలి" సలహా ఇచ్చారు మంత్రులు.

"బాగు బాగు! అలా చేద్దాం" అన్నారు రాజుగారు.

కుక్కలు వచ్చాయి. పిల్లుల బాధ తప్పింది.

అయితే రాను రాను ఇప్పుడు కుక్కల బెడద ఎక్కువయ్యింది.

"చిరుత పులుల్ని తెస్తే కుక్కల బెడద ఉండదు" అన్నారు మంత్రులు.

"సరే, తెప్పించండి మరి!" అన్నాడు రాజు.


కుక్కల బాధ తీరిపోయింది. అయితే త్వరలోనే చిరుతపులులు ఊళ్ల మీదికి వెళ్లసాగాయి. ప్రజలంతా వచ్చి రాజుగారికి మొరపెట్టుకున్నారు.

" 'ఏనుగులు ఏలే చోట చిరుతలు తిరగవు' అని శాస్త్రం.." చెప్పారు మంత్రులు, కొంచెం అనుమానంగానే.

"సరేలే, అదీ చూద్దాం" అని ఏనుగులను వదిలారు రాజుగారు.

కొద్దిరోజులకు నిజంగా ఏమైందో గాని, చిరుత

పులులన్నీ మాయం అయ్యాయి. అయితే ఇప్పుడు ఏనుగులు పొలాలమీద పడ్డాయి. చెరకు తోటలన్నీ నాశనం అవ్వసాగాయి.



"ఏనుగులు సింహాలకు భయపడతాయి ప్రభూ.." గొణిగారు మంత్రులు.

"చాలు చాలు! మీ సలహాలతో రాజ్యం అంతా గందరగోళమైంది. వీటన్నిటికంటే ఎలుకలే నయం" అన్నారు రాజుగారు.

రాజుగారిని పొగిడి ఇల్లు గట్టెక్కించుకునే మంత్రులంతా ఆయన తెలివిని ప్రశంసించారు. మరైతే ఎలుకల్ని తెప్పిస్తాం" అని ఎలుకల్ని తెచ్చి వదిలారు.

ఎలుకలు ఏనుగుల తొండాలలోకి దూరి సతాయించసాగాయి. చివరికి ఏనుగులు తట్టుకోలేక అడవిలోకి పారిపోయాయి.

రాజావారి గోదాంలో ఎలుకల బెడద మొదటికి వచ్చింది.

"ఎలుకల బెడదకు తట్టుకోలేక ఏనుగులంతటివే పారిపోయాయే, ఇక మనం ఎంత? పట్టించుకోవద్దు" అన్నారు తెలివి తెచ్చుకున్న రాజుగారు!

"అవునవును. పట్టించుకోకపోతే సరి!" అన్నారు భట్రాజు మంత్రులు, ఎగుర్లాడుతున్న ఎలుకల్ని చూసి మురిసిపోతూ.



దురాశేనండి!

రాజు: మామూలు తాళంతోపాటు కాంబినేషన్‌లాక్ ఉన్న బీరువాను ఎలా తెరవగలిగావు?

రవి: ఇలాంటి కిటుకులు చెప్పడానికి సాధారణంగా 1000 రూ. తీసుకుంటానండి

-సేకరణ: అలివేలమ్మ, చెన్నేకొత్తపల్లి



పుట్టినరోజు బహుమతి

చిట్టి కథల్లో చాలా బలం ఉంటుంది. ఇదిగో, అట్లాంటి చక్కని చిన్న కథ ...
రచన: డి. ఆశ, ఏడవ తరగతి, గుండువారి పల్లి, తలుపుల మండలం, అనంతపురం జిల్లా.

దీప్తి, మధుమతి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. దీప్తి పేద ఇంటి అమ్మాయి. మధుమతి పెద్ద ఇంటి పాప.

ఒకసారి మధుమతి పుట్టిన రోజు వచ్చింది. సాయంకాలం వాళ్ళింట్లో విందు. చాలామంది బంధువుల్ని, స్నేహితుల్ని ఆహ్వానించింది విందుకు. దీప్తిని కూడా రమ్మన్నది.

"నేను రాను లే" అంది దీప్తి.

"ఎందుకు రావు? రావాల్సిందే! నాకోసం, నాకు నచ్చే ప్రత్యేక బహుమతిని కూడా తెచ్చివ్వాలి నువ్వు" పట్టు పట్టింది మధుమతి.

పొదుపు డబ్బులతో తనకు ఏదైనా బహుమతి కొనుక్కుపోదామనుకున్నది దీప్తి. అయితే ఆ సరికే వాళ్లమ్మ ఆ డబ్బుల్ని ఇంటి అవసరాలకోసం వాడేసింది.

దాంతో చూసి చూసి, చివరికి ఉత్త చేతుల్తోటే మధుమతి ఇంటికి పోయింది దీప్తి.

చూడగా మధుమతి వాళ్ళింటికి ఎంతో మంది

ధనవంతులు పెద్ద పెద్ద కార్లలో వచ్చి ఉన్నారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో ఇల్లంతా వెలిగి పోతున్నది. వచ్చినవాళ్లంతా ఇచ్చిన ఖరీదైన బహుమానాలు అక్కడ కుప్ప పోసి ఉన్నాయి.



"ఏయ్! నా ప్రత్యేక బహుమతి ఏది?" సంతోషంగా ఎదురొచ్చి చేయి పట్టుకొని, నవ్వుతూ అడిగింది మధుమతి.

దీప్తికి ఏడుపు వచ్చేసింది. "మేము పేదవాళ్లం కదే, మా ఇంట్లో డబ్బులు లేకపోయాయి. తగిన బహుమతిని ఇవ్వలేక పోతున్నానే" అని చెప్పాలనుకుంది. కానీ దు:ఖంతో నోట మాట రాలేదు.

"ఏయ్! ఏడుస్తావెందుకు?" అంటూ నడుం చుట్టూ చెయ్యి వేసి మధుమతి దీప్తిని మిద్దెపైకి పిలుచుకొనిపోయింది.

"చూడు దీప్తీ! ఇన్నేళ్ళుగా మనం స్నేహితులం కదా, నీ గురించి నాకు తెలీదా? చూడు, నాకోసం పనిగట్టుకొని ఇంత మంది బంధుమిత్రులు వచ్చినా, ఇన్నిన్ని బహుమతులు ఇచ్చినా, నాకు అమ్మలేని లోటును వీళ్లెవరైనా పూడ్చగలరా?

ఒకసారి నీ పుట్టిన రోజునాడు మీ ఇంటికి వచ్చాను. గుర్తుందా? ఆ రోజు మీ ఇంట్లో ఏ విందూ లేదు; ఎవ్వరూ బహుమతులు తేలేదు; కానీ నువ్వు మీ అమ్మానాన్నల దగ్గరికి పోయి వాళ్ల కాళ్లకు దండం పెట్టావు. అప్పుడు మీ అమ్మ నీ తల నిమిరి, నీ నుదుటి మీద ముద్దు పెట్టింది. అట్లాంటి బహుమతి ప్రపంచంలో ఇంకొకటి వుంటుందా?

నీనుండి నేను కోరుకునే ప్రత్యేక బహుమతి అదే. నీ ప్రేమని కొద్దిగా నాకూ పంచు. అదేనే, నాకు కావలసిన బహుమతి!" అంది మధుమతి.

ఆప్యాయతతో ఇద్దరి కళ్ళూ చెమర్చాయి.

చిలకల ముగ్గు

బొమ్మకు కథ
రచన: రేణుక, ఎనిమిది జాస్మిన్, అరవింద హైస్కూల్



'ఆది'కి ఆరేళ్ళు. ఒకటో తరగతి. అంత చిన్న పిల్లవాడు కదా, అయినా వాడికి జంతువులన్నా, పక్షులన్నా చాలా ఇష్టం. ఊరికే వాటితో ఆడుకోవటం కాదు- చాలా వాటిని వాడు ఇష్టంగా పెంచేవాడు. చిట్టి చిట్టి పిల్లి పిల్లలు, కుయ్ కుయ్ మనే కుక్క పిల్లలు, రక రకాల పక్షి పిల్లలు, పురుగులు- ఆది చేత సంరక్షించబడే జంతువులు ఎన్నెన్నో ఉండేవి వాడి దగ్గర. వాడు బడికి వెళ్లి వచ్చే దారిలో పాతబడిన ఇల్లొకటి ఉండేది. తనకి దొరికిన జంతువుల్నన్నిటినీ వాడు ఆ ఇంట్లో ఉంచేవాడు. రోజూ తను తినేందుకు తెచ్చుకునే భోజనంతో పాటు ఆ జంతువులకు, పక్షులకు కూడా ఆహారం తెచ్చేవాడు.

ఒకరోజు సాయంత్రం కొంచెం సేపు వాటితో ఆడుకొని వెళ్ళాడు ఆది. తర్వాతి రోజున వెళ్ళి చూస్తే ఏముంది? అక్కడ మొత్తం మారిపోయింది- ఏవీ లేవు అక్కడ! ఆదికి ఏడుపు వచ్చింది. బాధ పడుతూనే కొద్దిసేపు ఇంట్లో అంతా వెతికాడు. ఎక్కడా ఒక్క జంతువుకూడా కనబడలేదు. పైగా ఆరోజు స్కూలుకి సెలవు! దాంతో ఆరోజు సాయంత్రం వరకు అక్కడే, వాటికోసం ఎదురు చూసుకుంటూ ఉన్నాడు. అయినా ఒక్క జంతువుగానీ పక్షిగానీ తిరిగి రాలేదు!

సాయంత్రం ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్ళేసరికి ఆది ఒళ్ళు కాలిపోతున్నది.

ఆరోజే కాదు, తర్వాతి రోజున కూడా జ్వరంలో ఆది కలవరిస్తూనే ఉన్నాడు- 'పక్షులు!' 'జంతువులు' అని. ఆది వాళ్ల అక్క సునీత వాడిని బుజ్జగించి అడిగింది- 'అసలు ఏమైందిరా, ఆదీ?'అని. జరిగినదంతా అక్కకు చెప్పాడు ఆది. "అయ్యో! అది మామూలేరా, అవన్నీ మేత కోసం బయటికి వెళ్లి ఉంటాయి. వాటికి నీ ఇంటి అడ్రసు తెలీదు కదా, అందుకని ఎక్కడెక్కడో బంధువుల ఇళ్లలో ఆగి ఉంటాయి. ఏమీ పర్లేదులే ఇదిగో, ఇవి చూశావా? మన దగ్గర నుండి ఎప్పటికీ, ఎక్కడికీ వెళ్లని పిట్టలు!" అని చెప్పి తను వేసిన చిలకల ముగ్గును వాడి చేతికి ఇచ్చింది అక్క.

"మరి ఇవి రంగుల పిట్టలు కాదు" అన్నాడు వాడు.

"నీ పిట్టలు రంగులవా?" అడిగింది అక్క.

"అవును- ఐదేసి రంగులుంటాయి" అన్నాడు ఆది.

"వేసి చూపిస్తావా, నేను క్రేయాన్సు ఇస్తాను?" అంది అక్క.

బొమ్మకు రంగులు కొట్టటం మొదలు పెట్టాడు ఆది.

అక్క బొమ్మలు వేసి ఇస్తూ ఉన్నది. ఆది రంగులు కొడుతూ ఉన్నాడు...

మెల్లగా ఆది జ్వరం తగ్గిపోయింది.



నవ్వులు

టీచర్: ఈ రోజు క్లాసుకు నువ్వొక్కడివే వచ్చావేంటి?

రవి: నిన్న చెప్పిన పాఠంలో ప్రశ్నలు అడుగుతానన్నారుగా, సార్?!

టీచర్: మరి నువ్వు బాగా చదువుకొచ్చావుగా?!

రవి: నిన్న నేను అసలు స్కూలుకే రాలేదు టీచర్!

- ఏడవ తరగతి పిల్లలు, మోడల్ స్కూల్, సికెపల్లి.

పోలీసు: రాత్రి పూట ఎందుకు ఇలా తిరుగుతున్నావు? ఏంటి, నీ సంజాయిషీ ?

రంగ: నా భార్యా పిల్లలకు సంజాయిషీ ఇవ్వలేకే ఇలా తిరుగుతున్నా, మధ్యలో మీరేంటి సార్?

- ఏడవ తరగతి పిల్లలు, మోడల్ స్కూల్, సికెపల్లి.



భోజన ప్రియుడు

రచన: డా. సిరి, మిర్యాలగూడ

మహేంద్రపురాన్ని పాలించే నరేంద్రుడు భోజనప్రియుడు. భోజనం గురించి తప్ప, అతను ఇంక దేని గురించీ పట్టించుకునేవాడు కాదు. అసలు విరామమే లేకుండా, ఎప్పుడూ ఏదో ఒకటి తింటూ ఉండేవాడు. పైగా 'ఇలా తినగలగడం ఒక కళ!' అని చెప్పేవాడు.

రాజ్యంలోని మేటైన వంటవాళ్ళు ఆయన వంటశాలలో ఉండేవాళ్ళు. మహారాజుకి ప్రతిరోజూ కొత్త కొత్త వంటకాలు చేసి పెట్టేవాళ్ళు.

మొదట్లో వాళ్ళ వంటకాలన్నీ రాజుకు అమోఘంగాను, అద్భుతంగాను అనిపించేవి.

ఏ పూటకాపూట ఆయన వాటిని గొప్పగా మెచ్చుకుంటూ, ఆనందంగా తినేవాడు. కానీ ఎందుకనో, మరి రోజు రోజుకీ వాళ్ల పనితనం తగ్గింది. వాళ్ల చేతి వంటలు రాను రాను వెగటు పుట్టించసాగాయి.

ఒకరోజు అతను మంత్రి సుధాముడిని పిలిచి, "మంత్రివర్యా, ఎందువల్లనో మన వంటవాళ్లు తమ పనిని బాగా చేయలేకపోతున్నారు. వాళ్ల వంటకాల్లో రుచి ఉండటం లేదు. వండినవే మళ్లీ మళ్లీ వండుతున్నట్లున్నారు. పాత రుచులు నాలుకకు వెగటు పుట్టిస్తున్నాయి. మీరు మన సైనికుల్ని దేశం నలుమూలలకూ పంపించండి. దేశంలో ఉన్న మేటి వంటగాళ్ళను రప్పించి పనిలో పెట్టండి" అన్నాడు.

దేశం నలుమూలల నుండి వచ్చిన మేటి వంటగాళ్లను త్వరలోనే నరేంద్రుడి ముందు హాజరు పరిచాడు సుధాముడు. నరేంద్రుడు వాళ్ళకు కొన్ని పరీక్షలు పెట్టాడు. అందులో విజేతలుగా నిలిచినవారిని ఆస్థాన వంటవాళ్ళుగా నియమించాడు. అట్లా మళ్లీ కొత్త వంటకాలతో హాయిగా, తృప్తిగా భోజనం చేయసాగాడు.

కొన్నాళ్లకి ఎందుకనో, మరి ఈ వంటకాలలో కూడా రుచి అందలేదు. ఇప్పుడాయనకు ఏం తిన్నా రుచించట్లేదు. రాజ వైద్యుడు అన్నాడు "మహారాజా, అన్ని అనారోగ్యాలకూ మూలం అజీర్తి. మీకు ఆహారం సరిగా జీర్ణం కావటం లేదు. ఆహారాన్ని మీరు వెండి పాత్రలో సేవిస్తున్నట్లున్నారు. వేడి వేడి ఆహారాన్ని పసిడి పాత్రలో పెట్టుకొని తింటేనే, మీ సమస్య దూరమయ్యేది. నిజం చెప్పాలంటే, ఇన్నాళ్లూ మీరు పసిడి కంచంలో అన్నం తినకపోవటంవల్లనే మీకు ఈ అనారోగ్యం వచ్చింది" అని.

నరేంద్రుడికి మొదటి ఇష్టం భోజనమైతే, రెండవ ఇష్టం బంగారమే! ఆయనకు రాజవైద్యుడి సలహా చాలా నచ్చింది. ఇక ఆనాటి నుండి ఆయన భోజనం అంతా శుద్ధమైన బంగారు పళ్ళాలలోనే! పసిడి పాత్రలో తినడం వల్ల ఆయన ఆరోగ్యం మెరుగైంది. వంటకాల రుచి కూడా పెరిగింది!

ఇంత గొప్ప సలహా ఇచ్చినందుకు రాజవైద్యుడిని మెచ్చుకొని ఘనంగా

సన్మానించాడు నరేంద్రుడు. అయితే కొంత కాలానికి, పసిడి పళ్ళాల భోజనం కూడా రుచి తగ్గింది! "బహుశ: ఈ పాత్రల తయారీలో ఏదో లోపం ఉండచ్చు" అనుకున్నాడు రాజు. దాంతో రోజుకొక కొత్త బంగారు పళ్ళెం వాడుకలోకి తెచ్చారు.

బంగారు పాత్రలు ఎన్ని మార్చినా, వంటగాళ్ళను మార్చినా, విదేశాలనుండి రకరకాల సుగంధ ద్రవ్యాలను తెప్పించి వాడినా, ఇప్పుడిక రాజుకి అవేవీ మునుపటిలా రుచించటంలేదు. దాంతో ఆయనకు రుచికరమైన ఆహారం గురించేగాక, తన ఆరోగ్యం గురించి కూడా పెద్ద దిగులు పట్టుకున్నది.

ఒకనాడు మంత్రి సుధాముడు "ప్రభూ! జంతువులు వేటాడి ఆహారాన్ని సంపాదించుకుంటాయి. వేట మాంసం రుచికరంగా ఉండటమేకాక, ఆరోగ్య పరంగా కూడా చాలా విలువైనది అని చెబుతారు. తమరి సమస్యకు వేట సమాధానం ఇస్తుందేమో. ఒకసారి వేటకు వెళ్దామా?" అన్నాడు.

రాజుగారికి ఆ ఆలోచన నచ్చింది. వేటమాంసం తలచుకొని నోరూరింది కూడా. "సరే! వెంటనే వెళ్దాం" అని మంత్రి వెంట అడవికి బయలుదేరాడు.

ఎప్పుడూ తినడమే తప్ప ఏనాడూ పనిచేయని నరేంద్రుడు, అడవిలోకి సగం దూరం వెళ్లేసరికి అలసిపోయాడు. "మంత్రివర్యా, చాలా అలసటగా ఉంది. కాసేపు ఇక్కడ విశ్రమించిన తరువాత మనం వేటను కొనసాగిద్దాం" అన్నాడు.

"మహారాజా, అడవిలో ఇది భయంకరమైన పులులు, సింహాలు సంచరించే ప్రదేశం. ఇట్లాంటి చోట వేటాడవచ్చు గానీ, విశ్రమించడం ఏమంత మంచిది కాదు. ఈ ప్రాంతాన్ని దాటి వెళ్లాక మరెక్కడైనా విశ్రమిద్దాం- ఇక్కడ వద్దు" చెప్పాడు సుధాముడు.

కానీ మహారాజు వినలేదు. "నా వల్ల కాదు" అని గుర్రం దిగి, విల్లూ బాణాలూ ప్రక్కన పెట్టి, ఓ చెట్టుకు చేరగిల పడబోయాడు.

ఆ చెట్టుకు కొద్ది దూరంలోనే ఒక పులి, తను కూడా విశ్రాంతి తీసుకుంటూ ఉండింది. వీళ్ల

మాటలకు చికాకు పడిందో ఏమో, అది పెద్దగా గాండ్రిస్తూ వీళ్ళ మీదికి వచ్చింది. చేతిలో ఆయుధాలు లేని నరేంద్రుడు, పులి గాండ్రింపు వింటూనే భయంతో పరుగులు పెట్టసాగాడు. రాజుగారిని కాపాడటం కోసం ఆయన వెనకే పరుగు పెట్టాడు సుధాముడు. వాళ్ళ వెంట పడిన పులి కొద్దిసేపటికి విరమించుకొని తన దారిన తాను పోయింది.



అట్లా వాళ్ళిద్దరూ అడవిని దాటి, రాజ్యపు పొలిమేరల్లోని ఒక ఊరు చేరుకున్నారు.

నరేంద్రుడు ఏనాడూ అంత దూరం పరుగెత్తలేదు. ఈ పరుగుతో ఆయన బాగా అలసిపోయాడు. అంతేకాక ఆయన ప్రొద్దుట్నుంచీ ఏమీ తినలేదు కూడానూ- దాంతో ఆయనకు విపరీతమైన ఆకలి వేసింది. అలసటతోటీ, ఆకలితోటీ అడుగు ముందుకు వేయలేకపోయాడాయన.

ఆయన్ని బుజ్జగిస్తూ, బ్రతిమిలాడుతూ, అక్కడికి దగ్గరలోనే ఉన్న ఒక ఇంటి వరకూ చేర్చాడు సుధాముడు. ఆ ఇంటి యజమాని రంగయ్య మంచివాడు. నరేంద్రుడి అవస్థను చూసి అతను కరిగిపోయాడు. వాళ్ళిద్దరినీ సాదరంగా ఇంటిలోనికి ఆహ్వానించి, తమ కోసం వండి పెట్టుకున్న వేడి వేడి భోజనాన్ని వాళ్లకు వడ్డించాడు. ఆకలితో అలమటించిపోతున్న నరేంద్రుడు తాను ఏం తింటున్నాడో కూడా గమనించకుండానే, గబగబా అన్నం మొత్తం తినేశాడు. కడుపునిండా మజ్జిగ త్రాగాడు.

"ఆహా, రంగయ్య గారూ! మీ భోజనం అమృతం లాగా ఉంది. ఇంత మంచి వంటకాలని నేను ఎప్పుడూ తినలేదు. ఇంత గొప్ప వంటకాలని తయారుచేయడం మీరు

ఎక్కడ నుండి నేర్చుకున్నారు? మీరు మజ్జిగ ఇచ్చిన పాత్రని ఏ లోహంతో తయారు చేశారు? నేనెప్పుడూ మజ్జిగ ఇంత కమ్మగా ఉండడం చూడనే లేదే! శుద్ధమైన బంగారు పాత్రలలో చేసినా కూడా, వంటలు ఇంత రుచిగా అనిపించలేదు మరి! మీరు వడ్డించిన ఆకులో ఏదో రహస్యం ఉందేమో! అది ఏ ఆకు?!" అని అడిగాడు నరేంద్రుడు సంబరపడిపోతూ.



నరేంద్రుని మాటలకు చిన్నగా నవ్వి "అయ్యా, మేం వడ్డించిన భోజనం బాగుందంటే, దానికి కారణం మేం ఏదో గొప్పగా వండడం కేనే కాదు- అసలు సంగతి ఏమంటే 'మీరు ఆకలితో ఉన్నారు'! ఆకలితో ఉన్నవాళ్ళకు చద్దన్నం కూడా పరమాన్నంలా అనిపిస్తుంది. మీకు మజ్జిగను ఇచ్చిన ఆ పాత్ర, ఏ లోహంతోనూ చేసింది కాదు- అది మామూలు మట్టి పాత్ర! ఇక ఆ ఆకంటారా, అది మామూలు విస్తరాకు! ఆకలితో తింటే అన్నం కూడా అమృతంలా వుంటుంది; అదేపనిగా తింటే అమృతంగా కూడా చేదుగా ఉంటుంది. అయినా తిన్నం తినడానికి బంగారు పాత్రలెందుకు, శుభ్రమైన ఆకు సరిపోతుంది కదా!" అన్నాడు రంగయ్య.

ఇన్నాళ్లూ తాను చేసిన తప్పిదం ఏమిటో ఒక్క మాటుగా తెలిసివచ్చింది, నరేంద్రుడికి: 'తను రుచి వెంట, సంపద వెంట పడ్డాడు; ఆకలిని పట్టించుకోలేదు! అసలు వంటకు రుచినిచ్చేది ఆకలే!'

ఆనాటి నుండి అతను వ్యర్థపు అలవాట్లను వదిలేసాడు. నిజమైన రాజుగా ప్రజాసంక్షేమం కోసం పాటుపడ్డాడు. కొద్ది కాలంలోనే 'భోజనప్రియుడు' అనే అపఖ్యాతిని వదిలించుకొని, 'జనప్రియుడు' అయ్యాడు.



పిల్లలవిజయం

ఉపాయంతో దేన్నైనా సాధించచ్చు. తలచుకుంటే ఏదైనా చేయచ్చు. ఈ కథని చదివి, ఆనక మీరేం చేస్తారో చేయండి!

రచన : ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగుళూరు.

"పిల్లలు తల్చుకుంటే ఏమైనాచేయగలరు " అన్నారు గణితం మాస్టారు.

"వాళ్ళ ముఖం! వాళ్ళకు దేశపటంలో నదులు గుర్తించటమే రాదు! ఇంక వాళ్ళేం చేస్తారు- ఉత్తి మాటలు!" అన్నారు చరిత్ర మేస్టారు.

"సామ దాన భేద దండోపాయాలని, ఉపాయాలు నాల్గువిధాలు. వీళ్ల చేత ఏదైనా పని చేయించేందుకు చరిత్ర నిరూపించిన మంత్రాలు చాలానే ఉన్నాయి. మీకేం కావాలో చెప్పండి, ఓ ఉపాయం పన్ని మీరు చెప్పిన పని చేయిస్తాను- చూద్దురు" అన్నారు తెలుగు అయ్యవారు.

"మీ వల్ల కాదండీ! ఊరికే ప్రయాస పడకండి" అన్నారు ఇంగ్లీషు సార్.

"సరే పందెం కాద్దాం. చెప్పండి. ఏం చేయించమంటారు?!" నిటారుగా

కూర్చున్నారు తెలుగు అయ్యవారు.

"సరే, మీరు అంతగా అడుగుతున్నారు కాబట్టి చూద్దాం. మీది తెలుగు సబ్జెక్ట్.. సరే- మీ ఏడో తరగతి పిల్లల చేత ఒక్కవంద పద్యాలు అప్పచెప్పించండి- చాలు" అన్నారు ఇంగ్లీషు సార్ కొంచెం ఆలోచిస్తూ.



తెలుగు అయ్యవారు వెనక్కి తగ్గలేదు- "ఓఁ..ఖచ్చితంగా చెప్పిస్తాను. పోటీ పెట్టుకోండి. గెలిచిన పిల్లలందరికీ మరి మీరు పిల్లల పండుగ రోజున నేను చెప్పిన బహుమతులు అంద జేయాలి, ఎంత ఖరీదైనా సరే! సరేనా?! ఇంకో మాట- ఈ విషయంలో నాకు మరో ఉపాధ్యాయుడి సహకారం కూడా కావాలి"అన్నారు తెలుగు అయ్యవారు.

"మీ వెంట నేనున్నాను తెలుగు అయ్యవారూ! ఏలాంటి సహకారం కావాలన్నా ఇస్తాను" అని డ్రాయింగ్ సార్ ముందుకొచ్చారు.

"మరింకేం?! మీకు సహచరుడు కూడా దొరికాడు. పదండి ముందుకు!" నవ్వారు ఇంగ్లీషు సార్.

"సరే! ఇక మీద ఏం జరుగుతుందో వెండితెర మీద చూస్తూండండి" అని డ్రాయింగ్ సార్ చెవిలో ఏదో రహస్యంగా చెప్పి నవ్వారు తెలుగు అయ్యవారు.

***

తర్వాతి రోజున ఏడో తరగతిలో తెలుగు క్లాస్-

"మీలోఎవరైనా వంద పద్యాలు చెప్పగలరా?" అడిగారు తెలుగు అయ్యవారు. తరగతిలో అంతా నిశ్శబ్దం.

"తెలుగు పిల్లలయ్యుండి మీకు కనీసం వంద పద్యాలు కూడా రావంటే నాకు చాలా అవమానంగా ఉందిరా! ఏడో తరగతికి వచ్చారు- క్రింది తరగతుల్లో నేర్పిన పద్యాలు

కూడా నోటికి రాకపోవటమేంట్రా, అసలు? మాతృభాష రానివాడు ఇంక మాతృభూమికి ఏం సేవ చేస్తాడు, మాతృమూర్తికి ఏం సేవ చేస్తాడు? మీ చదువంతా వృధా రా! ఏడోతరగతికి వచ్చి, కనీసం వంద పద్యాలు కూడా రానివాడు అసలు నన్నడిగితే తెలుగు విద్యార్థిగా పనికేరాడు" కోపంతో ముఖమంతా ఎర్రగా చేసుకుని చిరచిరా నడిచి వెళ్ళిపోయారు తెలుగు అయ్యవారు.



పిల్లలంతా తలలువంచుకుని కూర్చున్నారు. "ఏనాడూ పన్నెత్తి ఒక్క మాట అనని తెలుగు అయ్యవారు ఇవాళ్ళేంటి, ఇంతలాగా తిట్టేసారు?" అని అంతా చిన్నబోయారు.

అంతలో తర్వాతి పీరియడ్ డ్రాయింగ్ మేస్టారు వచ్చారు. దిగాలుగా ఉన్న పిల్లల ముఖాలు చూసి "ఏంటర్రా! అట్లా వాడిపోయిన తోటకూర కాడల్లాగా ఉన్నారు? ఏం జరిగిందేంటి?" అడిగారు.

"మాకు ఏద్దైనా రాకపోతే మీరు చెప్పాలి గద సార్?! చెబితే మేం ఏదైనా నేర్చుకుంటాం కదా? తెలుగు అయ్యవారు అంతగా కోపం చేసుకునే అవసరం ఏముంది? ఓ పది సార్లు చదువుకుంటే వంద పద్యాలూ వచ్చేస్తాయి. దానిదేముంది, చిన్న తరగతుల్లో నోటికి వచ్చినవే కదా" ఫిర్యాదు చేస్తున్నట్లు అన్నది సుజన.

"వంద పద్యాలా! బాబోయ్ అన్నే?! నాకూ వచ్చో, రావో?" అన్నారు డ్రాయింగ్ సార్.

"లేదు సార్, మాకు వచ్చు, ఏమంటే అన్నీ ఒక్కసారి గుర్తుకు రావట్లేదు అంతే!" చెప్పాడు వినీష్.

"గుర్తుంచుకునేందుకే అయితే మార్గం ఒకటి ఉంది నా దగ్గర-" అంటూ ఒక ఉపాయం చెప్పారు డ్రాయింగ్ సార్-

అంతే! మరునాటి నుంచీ ఊరంతా మారి

పోయింది.

ఏడో తరగతి పిల్లలందరూ వేరువేరు గుంపులయ్యారు. ఒక్కో గుంపులోనూ ఐదుగురు పిల్లలు. ఉదయాన్నే అన్ని గుంపుల వాళ్ళూ బయల్దేరారు- బక్కెట్లూ, బ్రష్షులూ, రంగులూ పట్టుకొని. వాళ్ళ వెనకనే సాయంగా డ్రాయింగ్ సార్.. గుళ్ళ దగ్గర, మార్కెట్ దగ్గర, ఆఫీసుల మీద, నాల్గు దారుల కూడళ్ళలో- ఖాళీ ఎక్కడ కనిపిస్తే అక్కడ-గోడల మీద, ఎవరికి వాళ్ళు రాసుకొచ్చిన పద్యాల్ని చూసి రాసేశారు. సుమతీ శతకంలోంచి, వేమన శతకంలోంచి, భాస్కర శతకంలోంచి మంచి మంచి పద్యాలు; ఇవి కాక బాల రామాయణంలోంచి కొన్ని, భగవద్గీతలోంచి కొన్ని శ్లోకాలు- రోజు తిరిగే సరికి ఊళ్ళో గోడలన్నీ రంగు రంగుల పద్యాలతో నిండిపోయాయి.

మరునాటి నుండి ప్రతిరోజూ ప్రొద్దునే పిల్లల జట్లు ఒక్కో గోడ ముందు నిలబడి దాని మీది పద్యాల్ని పదిసార్లు -అక్కడే నిలుచుని- గట్టిగా- చదవసాగాయి. ఆ సమయంలో అటుగా పోయేవాళ్లంతా ఆగి, వీళ్ళు పాడేది విని, వాళ్ళూ పలికి, 'బలే పిల్లలు!' అని మెచ్చుకుంటూ పోయేవాళ్ళు. కొందరైతే 'బాగున్నై, ఇవి మా ఇంట్లో వాళ్లకీ నేర్పిస్తాం" అని కాగితాల్లో వ్రాసుకుని పోసాగారు.

ఇట్లా ప్రతి రోజూ ఉదయాన్నే ఊరు ఊరంతా ఈ జట్లకోసం ఎదురు చూడటం మొదలైంది. పిల్లలతో పాటు గొంతు కలిపే పెద్దలూ చాలామంది తయారయ్యారు. సాయం-కాలాలు రచ్చబండ దగ్గర పద్యాలు వినబడసాగాయి. చెరువుల దగ్గర నీళ్ళు ముంచుకుంటూ, మంచినీటి బావుల్లో నీళ్ళు చేదుకుంటూ పద్యాలు అప్పగించుకోసాగారు ఆడవాళ్లు. మూడు నెలల్లో వందకు పైగా పద్యాలు- పిల్లలకే కాక పెద్దలకు కూడా- వచ్చేశాయి!

మూడు నెలలు పూర్తయింది: పిల్లల పండుగ వచ్చింది. ఏడో తరగతి వాళ్లకే కాదు- బడిలోని పిల్లలందరికీ- పద్య పఠన పోటీలు పెట్టారు. "విజేతలకు మేమూ బహుమతులిస్తాం" అని ముందుకొచ్చారు, ఒక సంస్థ వాళ్ళు. పద్య పఠన పోటీలు మొదలయ్యాయి. పాల్గొన్న పిల్లలందరూ వంద పద్యాలు చెప్పారు.

నిర్వాహకులు ఆశ్చర్య పోయారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎవరెవరికి ఇవ్వాలో తెలీక తికమక పడ్డారు.

పిల్లల ఉత్సాహాన్ని చూసి ఇంగ్లీష్ సార్ ముచ్చట పడ్డారు. తెలుగు అయ్యవారు ముసిముసిగా నవ్వుకుంటూ "వంద పద్యాలు నోటికి రాని పిల్లలెవ్వరూ లేరు కనుక, ఇప్పుడిక అందరూ పద్యాలు రాయాలి. ఎవరైతే తప్పుల్లేకుండా వ్రాస్తారో వారికి బహుమతి" అని ప్రకటించారు.

"ఓఁ రాస్తాం" అని పిల్లలంతా పద్యాలు వ్రాస్తుండగా, గ్రామస్తులు వచ్చారు- "మేము కూడా చెప్తాం సార్, పద్యాలు! మాకూ పోటీ పెట్టండి గదా!" అంటూ.

వాళ్ళ ఉత్సాహం చూసి సంస్థ వాళ్ళు మురిసిపోయారు- "ఈ ఊళ్ళోవాళ్లని చూస్తుంటే బలే ఉంది- పెద్దలకు కూడా పద్య పఠనం పోటీనట! బహుమతులట! కానివ్వండి" అని ఉత్సాహ పరచారు. ఊళ్ళో ఎక్కడెక్కడి వాళ్ళూ వచ్చి పద్యాలు చెప్పారు.

ఆరోజు జరిగిన పోటీలు అసలు పోటీలు కావు! పిల్లలంతా ఒక్క తప్పు కూడా లేకుండా రాసారు! పెద్దలంతా ఒక్క తప్పూ లేకుండా పద్యాలు పాడారు! దాంతో ప్రతివారికీ బహుమతులు వచ్చాయి మరి!

మరునాడు అన్ని పేపర్లలోనూ ఆ ఊరి పద్యపఠనాన్ని గురించిన కథనాలు వచ్చాయి. అన్ని పత్రికల్లోనూ ఆ బాలవీరుల వార్తలే! పద్యాలు వ్రాసిన గోడ చిత్రాలు అట్లా పత్రికల్లోకీ ఎక్కాయి.

తెలుగు అయ్యవారి ఒక్క మాట, డ్రాయింగ్ సార్ ఇచ్చిన కొంచెం ఉత్సాహం-

కోతులన్నీ కలిసి లంకకు వారధి కట్టినట్లు ఊరు ఊరంతా వందపద్యాలు నేర్చుకోవటం- బలే ఉంది కదూ?!



మరచా!

డాక్టర్: మతి మరుపుకు ఇచ్చిన మందులు సరిగా వాడారా?

రోగి: ఏది ఎప్పుడు వాడాలో గుర్తురాక మానేశానండి!

-ఏడవ తరగతి పిల్లలు, మోడల్ స్కూల్, సికెపల్లి.



శ్రవణుడి కథ

పురాణ బాలలు

గాంధీ పిల్లవాడిగా ఉన్నప్పుడు ఆయన్ని చాలా ప్రభావితం చేసిన కథ ఇది. "శ్రవణుడు, హరిశ్చంద్రుడు- వీళ్ళిద్దరూ నాకు ఆదర్శాలు" అని చెప్పుకునేవాడాయన.

సేకరణ : శ్రీ పిడూరి కృష్ణమూర్తి గారు, విశ్రాంత సహాయ సంచాలకులు, వ్యవసాయశాఖ.

చిన్నప్పుడు మనల్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ, పెంచి పెద్ద చేస్తారు అమ్మానాన్నలు. మనం పెద్దయ్యేసరికి, వాళ్ళేమో ఇంక ముసలివాళ్ళవుతారు- క్రమంగా వాళ్ల పనులు వాళ్ళు చేసుకోలేనంత బలహీనం అయిపోతారు. అలాంటప్పుడు 'వాళ్లను కనిపెట్టుకొని ఉండటం, వాళ్ల ఇష్టాలను గమనించుకొని మెలగటం, వాళ్లకు కష్టం కలగకుండా చూసుకోవటం మన బాధ్యత. అదే ధర్మం' అని చెప్తాడు శ్రవణుడు.

అనగనగా ఎప్పుడో రామాయణకాలంలో, పేర్లు తెలీని ముని దంపతులు ఒకరు నివసిస్తూ ఉండేవాళ్ళు, ఓ అడవిలో. వయసు మీద పడుతున్నా వాళ్లకు సంతానం మాత్రం కలగలేదు. ఇద్దరూ చాలా చాలా

తపస్సు చేసాక, చివరికి వాళ్ళ కోరిక ఫలించింది. వాళ్లకో చక్కని కొడుకు పుట్టాడు.

అతనికి 'శ్రవణుడు' అని పేరు పెట్టారు వాళ్ళు. లేకలేక పుట్టిన కొడుకు గదా, అందుకని వాడిని అల్లారు ముద్దుగా పెంచారు. రకరకాల విద్యలు, మంచి సంగతులు నేర్పారు.


అయితే, శ్రవణుడికి పదహారేళ్ళు వచ్చేసరికి, వాడి అమ్మానాన్నలిద్దరూ పూర్తిగా ముసలి వాళ్లయిపోయారు. నడక తగ్గింది; బలం తగ్గింది; వాళ్ల కంటి చూపు కూడా క్రమంగా మందగించింది. చూస్తూ చూస్తూండగానే వాళ్ళు గ్రుడ్డివాళ్లయిపోయారు. ఇప్పుడు ఆ తల్లితండ్రులకు అన్నీ శ్రవణుడే. వాళ్ళు ఎక్కడికి వెళ్ళాలన్నా శ్రవణుడు ఉండాలి. ఏం కావాలన్నా అన్నీ శ్రవణుడే తెచ్చి అందించాలి.

శ్రవణుడు చాలా మంచివాడు. ముసలి తల్లిదండ్రుల అవస్థను అర్థం చేసుకున్నవాడు. కంటికి రెప్పలాగా చూసుకునేవాడు వాళ్లను.

అయితే ఒక రోజున శ్రవణుడి తల్లిదండ్రులకు ఒక కోరిక కలిగింది- "కాశీకి పోవాలి; గంగలో స్నానం చేయాలి; వీలైతే అక్కడే ఉండిపోవాలి" అని. ఆ రోజుల్లో కాశీకి వెళ్ళటం అనేది చాలా పెద్ద పని. రవాణా సౌకర్యాలు ఏవీ ఉండేవి కావు; దారి కఠినంగా ఉండేది; అనేక అడవులు, నదులు దాటుకొని పోవాల్సి వచ్చేది. వాళ్ళా ముసలివాళ్ళు- నడవలేరు; పైగా చూపుకూడా లేని వాళ్ళు. వాళ్ళను కాశీకి చేర్చటం అనేది శ్రవణుడికి ఏమంత సులభం కాదు. అయినా శ్రవణుడు వాళ్ల మాటను కాదనలేదు. ఎలాగైనా సరే, వాళ్ల కోరికను తీర్చాలనుకున్నాడు.

కావడిని ఒకదాన్ని తయారు చేసుకున్నాడు. కావడి అంటే తెలుసుగా, ఐదారు అడుగుల పొడవున్న గట్టి వెదురు బొంగు ఒకదాన్ని తీసుకొని, దానికి రెండువైపులా తాళ్లతో తక్కెడలు కట్టుకోవాలి. ఆ తక్కెడల్లో బరువులు పెట్టుకుంటే, కావడి కట్టెను భుజానికెత్తుకొని నడవచ్చు. శ్రవణుడు అట్లాంటి కావడిలో అమ్మానాన్నలను చెరొకవైపునా కూర్చొబెట్టుకొని, కావడిని

మోసుకొని, కాలినడకన ప్రయాణం సాగించాడు. ఎండను, వానను, శ్రమను, అలసటను దేన్నీ లెక్కచేయలేదు- 'అమ్మానాన్నల కోరికను నెరవేర్చాలి' అన్నదొక్కటే అతని సంకల్పం. అట్లా బయలుదేరి కొండలు, నదులు, వాగులు, వంకలు దాటుకుంటూ పోయి మెల్లగా అయోధ్యా రాజ్యపు సరిహద్దుల్లో ఉన్న అడవి ఒకదానిలోకి ప్రవేశించాడు.



మధ్యాహ్నం అయ్యింది. శ్రవణుడి తల్లిదండ్రులకు బాగా దాహం అయ్యింది- "ఎక్కడైనా మంచినీళ్ళు దొరుకుతాయేమో చూడు నాయనా" అన్నారు వాళ్లు. సరేనని వాళ్లను ఎత్తుకొస్తున్న కావడిని క్రిందికి దించి, సొరకాయ బుర్రను చేతపట్టుకొని, నీళ్ళకోసం వెతుకుతూ బయలుదేరాడు శ్రవణుడు. దగ్గర్లోనే ఒక సరస్సు కనబడింది. సరస్సులో నీళ్లు నిశ్చలంగా, తేటగా ఉన్నాయి. శ్రవణుడు క్రిందికి వంగి కూర్చొని, సొరకాయ బుర్రలోకి నీళ్ళు నింపుకోసాగాడు. నీళ్ళు లోపలికి పోతుంటే సొరకాయ బుర్ర 'బుడబుడ'మని శబ్దం చేస్తున్నది.

సరిగ్గా అదే సమయానికి వేటాడుతూ అటువైపుగా వచ్చాడు, అయోధ్య రాజు- దశరథుడు. దశరథుడు అప్పటికి ఇంకా కుర్రవాడు. 'శబ్ద భేది' అనే విద్యను సాధన చేస్తున్నాడు. లక్ష్యాన్ని చూడకనే, అటువైపునుండి వస్తున్న శబ్దాన్ని బట్టి బాణం వదలటం, లక్ష్యాన్ని ఛేదించటం- దీన్ని 'శబ్దభేది' అనేవాళ్ళు. దశరథుడికి శ్రవణుడు కనిపించలేదుగానీ, బుడబుడమని శబ్దం వినబడింది. 'జంతువేదో నీళ్ళు త్రాగుతున్నది' అనుకున్నాడు రాజు. అటువైపుగా గురి పెట్టి బాణం వదిలాడు. బాణం నేరుగా వెళ్ళి శ్రవణుడి గుండెకు గుచ్చుకున్నది! 'హా!' అని అరిచి క్రింద

పడిపోయాడు ఆ పిల్లవాడు!

శ్రవణుడిది పెద్ద మనసు. తన ప్రాణాలు పోతున్నాయని అతనికి అర్థమైంది. 'తను చనిపోతే పర్లేదు- కానీ తన తల్లిదండ్రుల గతి?! వాళ్ళు ముసలివాళ్ళు, పైగా చూపు లేని వాళ్ళు. తను లేకపోతే వాళ్లకు ఎవరు దిక్కు?' ఆ ఆలోచనతోటే అతని కళ్ళు మసకబారాయి.

అరుపును వినగానే దశరథుడి గుండెలు గుభేలుమన్నాయి. గబగబా పరుగెత్తుకొ-చ్చాడు. క్రిందపడి కొట్టుకుంటున్న శ్రవణుడిని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. సిగ్గుతోటీ, బాధతోటీ కుంచించుకు పోయాడు. శ్రవణుడిని ఒడిలోకి ఎత్తుకొని ప్రథమ చికిత్స చేసేందుకు ప్రయత్నించాడు. "నన్ను క్షమించు- శబ్దం విని ఇదేదో జంతువనుకున్నాను" అని మళ్ళీ మళ్ళీ వేడుకున్నాడు.

ప్రాణాలు పోతున్నా, శ్రవణుడు దశరథుడిని ఊరడించాడు తప్ప అతని మీద కోపగించుకోలేదు. "మా అమ్మా నాన్నలు గుడ్డివాళ్ళు; ముసలివాళ్లు. పూర్తిగా నా మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు వాళ్ళకు దాహం వేస్తున్నది. వాళ్ళకోసమని నీళ్ళు తీసుకెళ్తుంటే ఇలా అయ్యింది. ఇంక నా ప్రాణాలు నిల్చేట్లు లేవు. అదేమంత ముఖ్యం కాదు గానీ, ఇక మీద వాళ్ళు ఎలా బ్రతుకుతారో అనే, చింత వేస్తున్నది" అన్నాడు శ్రవణుడు.

"నీ తల్లి దండ్రుల సంగతి మరచిపో, వాళ్ల బాధ్యత నాది. ముందు నీ గాయం మాన్పటం గురించి చూస్తాను" అన్నాడు దశరథుడు.



శ్రవణుడు ఒప్పుకోలేదు. నీరసంగా నవ్వి, "లాభం లేదు. నా ప్రాణాలు ఇంకో రెండు

క్షణాలలో పోతున్నాయి. మీరు చేయగలిగింది ఒక్కటే- మీరు వదిలిన బాణపు ములుకు గుచ్చుకొని చాలా నొప్పిగా ఉంది. కాస్త ఆ బాణాన్ని లాగేశారంటే నా వేదన ఉపశమిస్తుంది. నేను ఇంకొంచెం సుఖంగా మరణిస్తాను. ఆలస్యం చేయకండి. ఆ వెంటనే ఈ సొరకాయ బుర్రలో నీళ్ళు తీసుకెళ్ళి మా అమ్మానాన్నల దాహం తీర్చండి. పాపం వాళ్ళు నాకోసం ఎదురు చూస్తుంటారు- వాళ్లకు నా మరణ వార్త తెలియజేయండి. ఆ తర్వాత విధిని అనుసరించి ఏమైనా చేయచ్చు" అన్నాడు. దశరథుడు బాణాన్ని బయటికి లాగిన వెంటనే శ్రవణుడు చనిపోయాడు.

దశరథ మహారాజు తల వాల్చుకొని కన్నీరుమున్నీరుగా ఏడ్చాడు. ఆపైన ఒక నిశ్చయానికి వచ్చి, శ్రవణుడి శరీరాన్ని అక్కడే విడిచి, సొరకాయ బుర్ర వేత పట్టుకొని శ్రవణుడి అమ్మానాన్నల దగ్గరికి వెళ్ళాడు.

అడుగుల శబ్దం వినగానే "నాయనా, శ్రవణా! ఇంత ఆలస్యం అయ్యిందేమిరా?" అడిగాడు శ్రవణుడి తండ్రి.

"ఇవి మా శ్రవణుడి అడుగులు కావు. ఎవరది? ఎవరు నువ్వు?-" అడిగింది శ్రవణుడి తల్లి, అడుగుల్ని బట్టే అపరిచితుడిని గుర్తుపడుతూ.

"నమస్కారం తల్లీ, నా పేరు దశరథుడు. మీకు ఈ నీళ్ళు ఇమ్మని పంపాడు మీ అబ్బాయి" అన్నాడు దశరథుడు సిగ్గుగా.

"వాడేడి? వాడికేమైంది? వాడెందుకు రాలేదు?" అడిగింది తల్లి, అనుమానంగా.

దశరథుడు మారు చెప్పకుండా సొరకాయ బుర్రను అందించబోయాడు. వాళ్లు దాన్ని అందుకోనేలేదు.

"మావాడు రావాలి. వాడికేదో అయ్యింది. లేకపోతే ఇంత సేపు మమ్మల్ని విడిచి ఏనాడూ పోలేదు వాడు. నిజం చెప్పు. నువ్వే ఏదో చేశావు వాడిని. కదూ? ఏం చేశావు చెప్పు!" కోపంతో ఊగిపోయాడు శ్రవణుడి తండ్రి.

ఇక చేసేది లేక, జరిగిందంతా వివరించాడు దశరథుడు.

శ్రవణుడి తల్లిదండ్రులు విపరీతంగా

ఏడ్చారు. "అమాయకుడైన మా కుమారుడిని మానుండి దూరం చేసిన ఈ పాపం ఊరికే పోదు. రాజా! నువ్వు కూడా మాలాగానే పుత్ర శోకంతో మరణిస్తావు. నీ కొడుకు నీ నుండి దూరం అవుతుంటే, ఆ దు:ఖాన్ని భరించలేక నీ గుండె ఆగిపోతుంది. పుత్రశోకం ఎలా ఉంటుందో అప్పుడు కానీ నీకు అర్థం కాదు" అని శపించారు. దశరథుడు ఎన్ని రకాలుగా ఊరడించాలని ప్రయత్నించినా శాంతించలేదు వాళ్ళు. కొద్ది సేపట్లోనే వాళ్ళిద్దరూ కూడా గుండెలు పగిలి చనిపోయారు!

తెలిసి చేసినా, తెలియక చేసినా- తప్పు తప్పే! దాని ఫలితాలను మనం అనుభవించక తప్పదు. తన తప్పును గుర్తించిన దశరథుడు శ్రవణుడికీ, అతని తల్లిదండ్రులకూ విధి పూర్వకంగా అంతిమ సంస్కారాలు నిర్వహించి, బరువెక్కిన హృదయంతో రాజధానికి చేరుకున్నాడు.

ఆ తర్వాత చాలా సంవత్సరాలకు గానీ అతనికి పిల్లలు పుట్టలేదు. లేక లేక పుట్టిన శ్రీరాముడి మీద విపరీతమైన ఇష్టాన్ని పెంచుకున్నాడు దశరథుడు. ఆ రాముడు పెద్దయి, సీతతోటీ, లక్ష్మణుడితోటీ అడవికి పోతుంటే, ఆ బాధకు తట్టుకోలేక చనిపోయాడు చివరికి!



అతికే అబద్ధం!

ఒక అమెరికావాడు, ఒక జపాన్ వాడు, ఒక ఇండియావాడు మాట్లాడుకుంటున్నారు:

అమెరికా వాడు: మొట్టమొదట చంద్రునిపై కాలుమోపింది మా దేశం వాళ్ళే!

జపాన్ వాడు: మొట్టమొదట అంగారకునిపై కాలు మోపింది మా వాళ్ళే!

ఇండియా వాడు: మొట్టమొదటి సూర్యునిపై కాలుమోపింది మా దేశం వాళ్ళే!

జపాన్, అమెరికా వాళ్లు: ఆ అదేంటి, సూర్యుడు వేడిగా ఉంటాడు కదా?

ఇండియావాడు: తెలుసు! అందుకే రాత్రి పూట వెళ్లారు మా వాళ్ళు!

c. గిరీష్, ఎనిమిదవ తరగతి, గుండువారి పల్లె



ఏం జరిగింది?

అపరాధ పరిశోధన

రచన: అఖిల్ కుమార్, ఇంటర్మీడియట్, భవానీపురం, విజయవాడ, కృష్ణా జిల్లా.

ఎప్పటిలాగే ఆఫీస్‌కు వెళ్లడానికి రెడీ అవుతున్నాడు సాయి. ఇంటి బయట తన కారు పార్క్ చేసి ఉంది.

సాయి ఇంటి ప్రక్కనే ఉంటాడు శ్రీరాం. చాలా స్నేహంగా మాట్లాడతాడు. రోజూ సాయంత్రం ఆఫీసునుండి రాగానే సాయి, శ్రీరాం ఇద్దరూ కలిసి ఏవో ముచ్చట్లు పెట్టుకుంటూ ఉంటారు. ఇద్దరికీ ఇంకా పెళ్ళి కాలేదు; ఇద్దరూ ఎవరికి వాళ్ళు వంట చేసుకుంటారు; దాంతో ఏవో పప్పుల కోసమూ, ఉప్పుల కోసమూ కూడా తరచు ఇద్దరూ కలుస్తుంటారు, ఉదయం ఆఫీసులకి వెళ్ళేముందు కూడా.

ఆరోజు అప్పటికే బాగా ఆలస్యం అయింది సాయికి. హడావిడిగా టిఫిన్ చేసి, బాక్సు సర్దుకునేంతలో తలుపు చప్పుడయింది. కాలింగ్ బెల్ మ్రోగింది.

"వస్తున్నా!" అంటూ తలుపు తీసిన సాయి నిర్ఘాంతపోయాడు- ఎదురుగుండా ఇద్దరు పోలీసులు- చేతిలో బేడీలతో నిలబడి ఉన్నారు.

"నీ పేరు?" అడిగారు వాళ్ళు.

"సాయి"

"ఇంటి పేరు?"

"మక్కల"

"మక్కల సాయి- వీడే- రాసుకో" అన్నాడో పోలీసు. రెండోవాడు ఏదో శ్రద్ధగా రాసుకున్నాడు.

"తండ్రి పేరు?" అడిగారు.

చెప్పాడు సాయి. "ఎందుకండీ అడుగుతున్నారు? ఏమయింది?"

"నీకు తెలీదా? పద, స్టేషనుకు. సార్ రమ్మంటున్నారు"

"ఏ సార్?"

"ప్రధానమంత్రిగారు. నీ కోసం ప్రధాని స్వయంగా కబురు పంపుతున్నారు రా, నీ పెళ్ళి చేస్తారట! పల్లకీ పంపారు; ఎక్కి రమ్మంటున్నారు! మర్యాదగా వస్తావా, రావా?!" చెయ్యెత్తాడు పోలీసు. సాయి ఇంకేమీ అడగకుండా వాళ్ల వెంట బయలుదేరి పోయాడు.

పోలీస్ స్టేషన్లో సాయిని నేరుగా దొంగల్ని ఉంచే చోటికి తీసుకెళ్ళి నిలబెట్టారు. యస్సై వచ్చి అడిగాడు. "నువ్వే కదా, సాయి? APZX 54321 కారు నీదేనా?" అని.

"అవునండీ, ఏంటి సంగతి?" అడిగాడు సాయి, మర్యాదగా.

"అది నేను అడగాలి- ఏం చేసావురా, వాడిని?"

"ఎవరిని సార్?"

"వామ్మో, వామ్మో!ఎంత చక్కగా అడుగుతున్నావమ్మా! నంగనాచిలాగా? మర్యాదగా చెప్పు- ఏం చేశావు వాడిని? ఎందుకు చంపావు?"

"ఎవరిని?! నేను ఎవ్వరినీ ఏమీ చెయ్యలేదు సార్!"

"ఇదిగో, నేను నీలాంటి వాళ్లని లెక్క లేనంత మందిని చూశాను. అసలు నీలాగా కండలు పెంచేవాళ్లంటే నాకు తెగ మంట. నీ కండలన్నీ వదిలించేస్తాను- మర్యాదగా శ్రీరాంని ఏం చేసావో చెప్పు- ఎందుకు చంపావు వాడిని?"

సాయి నిర్ఘాంతపోయాడు. తను శ్రీరాంని చంపటమేమిటి?

కానీ పోలీసులు అతని మాటలు వినలేదు. ఇష్టంవచ్చినట్లు లాఠీలతో చితక బాదారు. మళ్ళీ మళ్ళీ బెదిరించారు- నిజం చెప్పమని. కానీ తను ఏం చెప్పగలడు? శ్రీరాంని తను చూసింది నిన్న రాత్రే. అతన్ని ఎవరు చంపి ఉంటారు? ఎందుకు చంపారు?

వాళ్ల మాటల వల్ల సాయికి సంగతేంటో కొంచెం కొంచెంగా అర్థమైంది. "నిన్న రాత్రి శ్రీరాం హత్యకు గురయ్యాడు. హంతకులు తాము ఉపయోగించిన కత్తిని తను అక్కడ నిలిపి ఉంచిన కారు డిక్కీలో పడేసి పోయారు. ఆ సమయానికి తన కారు డిక్కీకి తాళం వేసి లేదు. ఉదయాన్నే పోలీసులకు ఆ సమాచారం అంది, వాళ్ళు అక్కడికి చేరుకున్నారు. పోలీసు కుక్కలు వాసన పట్టి, కారు డిక్కీని చూపించాయి. అందుకని పోలీసులు ఇప్పుడు తనని అనుమానిస్తున్నారు.."

ఆ రోజంతా పోలీసులు సాయిని రకరకాలుగా వేధించారు. సాయి ఒళ్ళంతా హూనం హూనం అయ్యింది. సాయంత్రం అవుతుండగా ఇద్దరు పోలీసులు వచ్చి అతన్ని జడ్జి గారి దగ్గరికి తీసుకెళ్ళారు. జడ్జిగారు అడిగారు- "చూస్తుంటే మర్యాదస్తుడిలాగా ఉన్నావు. హత్య ఎందుకు చేసావు?" అని. సాయి కళ్ళ నీళ్ళ పర్యంతం అయిపోయి ఆయనకు మొరపెట్టుకున్నాడు- "సర్, నేను అమాయకుడిని. హంతకులెవరో ఆ కత్తిని తెచ్చి నా కారు డిక్కీలో వేసి ఉంటారు. డిక్కీకి తాళం వేసి లేదు కదా. నన్ను కాపాడండి" అని.

జడ్జిగారు పోలీసులను అడిగారు- "ఇతని వేలిముద్రలు తీసుకున్నారా? అవి హత్యా ప్రదేశంలోని వేలిముద్రలతో సరిపోయాయా?" అని.

"తీసుకున్నాం సర్, కానీ అక్కడున్న ముద్రలు వేరు, ఇతని వేలి ముద్రలు కావు అవి" చెప్పారు పోలీసులు.

"మరి మీ కుక్కలు ఇతన్ని గుర్తుపట్టి చూపాయా?"

"లేదు సర్, ఇతని కారును చూపించాయంతే"

"మరయితే ఇతన్ని పట్టుకొచ్చారెందుకు?

ఇతను హంతకుడికి ఏమవుతాడు?"

"ఇతను ఉండేది ఆ పక్క ఇంట్లోనే సర్. అతను ఇతనూ మిత్రులు"

"అంతకు మించి వేరే ఏ సంబంధమూ లేనప్పుడు, మీ దగ్గర వేరే ఆధారాలేమీ లేనప్పుడు, ఇతన్ని పోలీసు రిమాండ్‌లో ఉంచేందుకు నేను ఒప్పుకోను. ఇతని తరపు లాయరును పిలిపించండి. వెంటనే బెయిలు ఇచ్చి పంపించండి. ఇదిగో మిస్టర్ సాయి, పోలీసులు ఇప్పటికి నిన్ను వదిలేస్తారు. కానీ ఎప్పుడు అవసరమైతే అప్పుడు నువ్వు కోర్టులో సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. కోర్టువారికి ఒక పూచీకత్తు బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది- పదివేల రూపాయల్ని బ్యాంకులో జమ చేయాలి. ఈ కేసు పూర్తయేంతవరకూ ఆ డబ్బును ముట్టుకునే వీలుండదు. సరేనా?"

***

సాయి ఇంటికి వచ్చేసాడు, కానీ అతని మనసు మనసులో లేదు. "శ్రీరాం హత్యకు గురవ్వటం ఏంటి? ఎవరు చంపారు అతన్ని? ఎందుకు చంపారు?" బక్కెట్లో నీళ్ళు తీసుకొచ్చి కారును శుభ్రం చేస్తూ ఆలోచిస్తున్నాడు- "కారు డిక్కీ తలుపు ఎందుకు తెరిచి ఉన్నది? నేనెప్పుడూ తాళం వేసే ఉంచుతానే?". డిక్కీ తలుపుకు ఉన్న హ్యాండిల్‌ని పరిశీలిస్తే అర్థమైంది- "ఓహో! డిక్కీకి తాళం వేసే ఉండింది. కానీ వాళ్ళెవరో ఏదో సుత్తిలాంటి బరువైన వస్తువుతో కొట్టి, తాళాన్ని విరిచేసారు.."

అంతలో అతని దృష్టి కారు ప్రక్కనే ఉన్న పెద్ద బండరాయి మీద పడింది- "ఈ రాయి సాధారణంగా రోడ్డుకు అవతలివైపున పడి ఉండేది- మరి ఇక్కడికెలా వచ్చింది?"

సాయి మెల్లగా ఆ బండ ఎప్పుడూ పడి ఉండే చోటుకు పోయాడు. రాయి నిన్నటి వరకూ ఇక్కడే ఉండింది- దాని గుర్తులు ఇంకా ఉన్నై, అక్కడ మట్టిలో.

"దీన్ని అక్కడికి ఎందుకు తీసుకెళ్ళారు? డిక్కీ తాళాన్ని పగలగొట్టేందుకు ఈ రాయిని వాడారన్నమాట!"

బండ ఉండిన ప్రాంతాన్ని పరిశీలించాడు సాయి. అక్కడికి దగ్గర్లోనే, గడ్డిలో మెరుస్తూ

కనిపించింది ఒక చేతి గడియారం!

గడియారం కొత్తదే, సిటిజన్‌ది. బాగా ఖరీదైనదేమీ కాదు; కానీ సిటిజన్ కంపెనీ డీలరు ఈ ఊళ్ళో ఒక్కడే ఉన్నాడు!

సాయి ఆ గడియారాన్ని పట్టుకొని తమ ఊళ్ళో ఉన్న సిటిజన్ కంపెనీ డీలరు దగ్గరికి వెళ్ళాడు. ఆ డీలరు తనకు పరిచయమే. "రండి రండి సాయిగారూ! చెప్పండి- నేను మీకేం సాయం చేయగలను?" నవ్వుతూ అన్నాడు డీలరు.

సాయి సంగతంతా చెప్పి, తనకు దొరికిన గడియారాన్ని ఆయనకు చూపించాడు.

"దీన్ని ఈమధ్యే కొన్నారెవరో.. దొరుకుతారులెండి, మీరేమీ చింతపడకండి" అంటూ పుస్తకాల్లో మునిగాడాయన. కొద్దిసేపటికి రెండు అడ్రసులు ఇస్తూ చెప్పాడు- "మీరేమీ సాహసాలు చేయ-నక్కర్లేదు. ఈ రెండు చిరునామాల్లో ఒకటి మీకు కావలసింది అయి ఉండచ్చు- మీరు దీన్ని పోలీసులకు ఇస్తే నయమేమో..? చూడండి, మీ ఇష్టం!" అని.

సాయి ఆయనకు ధన్యవాదాలు చెప్పుకొని తన వేట మొదలు పెట్టాడు.

మొదటి అడ్రసులో ఒక ముసలావిడ ఉన్నది. "అమెరికాలో ఉండే నా మనవడికి దీన్ని పుట్టిన రోజు బహుమతిగా ఇచ్చాను. ఎందుకు నాయనా?" అన్నది.

"ఓహో అవునాండి, అతను ఇక్కడికి ఎప్పుడొచ్చాడు?" అడిగాడు సాయి.

"ఐదారు నెలలైంది నాయనా, మళ్ళీ అప్పుడే అమెరికా వెళ్ళిపోయాడు కూడాను"

సాయి పని పూర్తయింది. తనకు కావలసిన వాళ్ళు వీళ్ళు కాదు. "సరేనండి. పర్లేదు. మళ్ళీ కలుస్తానండి"

"అయితే ఈ రెండో చిరునామాలో ఉండచ్చు- అసలు దొంగ!"

ఈ అడ్రస్ దొరకటం కొంచెం కష్టమైంది. అదొక పాత పెంకుటిల్లు. ఇంటి చుట్టూ శిథిలమైపోయిన కాంపౌండు. దాన్ని చూడగానే సాయికి "ఇదే!" అనిపించింది.

ఇంట్లో ఎవరో ఉన్నట్లున్నారు. మాటలు వినిపిస్తున్నాయి.

మెల్లగా కాంపౌండులో అడుగు పెట్టాడు సాయి. ఎండుటాకులు అతని కాళ్ల క్రింద

పడి గలగలమన్నాయి. ఇంట్లో మాటలు ఆగిపోయాయి.

సాయి వెళ్ళి తలుపు తట్టాడు.

"ఎవరది?" కరకు గొంతు ఒకటి వినబడ్డది లోపలినుండి.

"అడ్వర్టయిజ్మెంట్ సర్. వస్తువులేమైనా చూస్తారా?" ధైర్యంగా అడిగాడు సాయి.

"ఏమీ అక్కర్లేదు. ముందు ఇక్కడినుండి పారిపో" చికాకుగా పలికింది గొంతు.

సాయి వెనక్కి తిరిగి వెళ్తున్నట్లు ఎండుటాకులను గలగలమనిపించాడు.

కొద్ది సేపటి తర్వాత మెల్లగా వెనక్కి వచ్చి, ఈసారి ఇంటి పైకప్పు మీదికి ఎక్కాడు. లోపలినుండి ఎవరివో రెండు గొంతులు వినిపిస్తున్నాయి.

"అవునురా! ఇప్పుడు పారిపోవాల్సిందే. ఇంక ఇక్కడ ఉండటం కుదరదు. చాలా ఇళ్ళు అయ్యాయి. పోలీసులకు కబురు అందిందంటే మన పని ఆఖరు.."

సాయి మెదడు చురుకుగా పని చేసింది. వీళ్ళే, తనకు కావలసిన వాళ్ళు! ఇప్పుడేం చేయాలి? వెంటనే తన సెల్‌ఫోనులో వీడియో రికార్డరు ఆన్ చేసాడు. మెల్లగా ఒక పెంకును తొలగించాడు. ఏర్పడిన ఖాళీ ద్వారా లోపలి దృశ్యాన్ని వీడియోలో బంధించాడు.

ఆ తర్వాత కప్పు దిగి గబగబా పోలీసు స్టేషనుకు పరుగు పెట్టాడు.

పోలీసులు వీడియో సహాయంతో హంతకులను పట్టుకున్నారు. వాళ్ళు ఒక జాతీయ స్థాయి ముఠా సభ్యులు. ముఠా వారు ఆ సరికే చాలా ఇళ్ళు దోచుకున్నారు. మిగతా చోట్ల అంతటా దోపిడీలు సులభంగానే జరిగాయి గానీ, శ్రీరాం మటుకు వాళ్ళను ఎదిరించి పోరాడాడు. ఆ క్రమంలో వాళ్ళు అతన్ని కత్తితో పొడవటం జరిగింది.

"మొత్తం మీద నువ్వు మంచివాడివని నిరూపించుకున్నావయ్యా, సాయీ. అయినా నిన్ను పట్టుకోవటం వల్లనే అసలు హంతకులెవరో తెల్సింది మాకు" నవ్వారు ఇన్స్పెక్టరు గారు సాయి చేతులు పట్టుకొని ఊపుతూ!



పదాల్ని వెతికి పట్టుకోండి!

సెలవలు, దసరా, విజయదశమి, దుర్గాష్టమి, మహర్నవమి, కోడిపందెము, బోనాలు, కొత్తబియ్యము, చెరకుపంట, వడ్లు, దుర్గాపూజ, ఆయుధపూజ, కనుము, మాంసము, ఆటలు, పాటలు, బంధువులు, పల్లెటూరు, పిండివంటలు, రామలీల - ఈ పదాలన్నీ క్రింది పట్టికలో దాగున్నాయి- నిలువుగా, అడ్డంగా, వాలుగా, క్రిందినుండి పైకి- ఎటుపడితే అటు! వాటిని వెతికి పట్టుకోండి! వాటి చుట్టూ గుండ్రాలు గీయండి చూద్దాం!

లు	బం	బో	య్యు	ఆ	ము	ష్ట	శ	ల్లె	పం	లీ	ష్ట
ట	ధు	జ	టూ	దె	వం	డ్లు	మి	వ	ర్న	హ	మ
వం	వు	ఆ	పం	ర్న	ట	పం	కు	ర	చె	పం	ము
డి	లు	డి	శ	ల్లె	బో	వ	బో	య్యు	మి	ధు	ను
పిం	కొ	వం	టూ	ధు	ఆ	డ్లు	లు	ఆ	శ	పం	క
ర్గా	లు	నా	బో	ర్న	య్యు	ట	మాం	ల్లె	ద	ఆ	బో
ప	ల్లె	టూ	రు	శ	పా	ఆ	లు	ధు	య	యు	పం
ర్న	ష్ట	ర్గా	ము	ర్న	పం	మాం	లీ	బో	జ	ధ	వం
శ	సె	ర్న	టూ	య్యు	దు	ర్గా	ష్ట	మి	వి	పూ	ఆ
ము	మాం	ల	ధు	ర్గా	బి	ల్లె	దు	ర్గా	పూ	జ	ష్ట
ఆ	స	రా	వు	ష్ట	పం	త్త	య్యు	రా	మ	లీ	ల
య్యు	ర్గా	మాం	ల్లె	లు	వం	బో	కొ	పం	రా	స	ద

పదరంగం-78

నిర్వహణ: డా. శిరీష, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా.

1	2	★	3		4
★	5			★	
6		★	7	8	★
9		10	★	11	12
	★	13			
14			★	15	

అడ్డం

1. ఐదు తరువాత వచ్చే అంకె (2)

3. 'దోమ'కి బహువచనం(3)

5. చాలా ఇళ్లలో పూజించే మొక్క (3)

6. ఒకటిలో నాలుగో వంతు (2)

7. కోయ భాషకు ఇది లేదు (2)

9. 'మలుపులు'కి ఏకవచనం(3)

11. 'ఓడ'కి మరో పేరు(2)

13. వరస తప్పిన 'కలువలు' (4)

14. 'ముడుపు'-2, 1, 3 (3)

15 మౌనంగా ఉండే ఋషిని ఇలా పిలుస్తారు (2)

నిలువు:

2. తప్పిన ఋతువులు (4)

3. 'దోసిలి నిండింది"లో మొదటి మూడక్షరాలు (3)

4. తలక్రిందులైన 'పాలు'(2)

6. 'పండితుడికి వ్యతిరేక పదం (4)

8. నాకము కాని నాకము (4)

10.రుచులలో ఒకటి, ఎటు నుండి రాసినా మారదు(3)

12. తలక్రిందులైన 'నిలువ' (3)

అడ్డం-నిలువు ఆధారాల సహాయంతో ఈ గడులను నింపగలరేమో చూడండి. నింపిన పదరంగాన్ని, కేవలం పోస్టుకార్డుపై రాసి, మాకు పంపండి. మీ బడి పేరు, తరగతి, మీవాళ్ల ఫోను నంబరు తప్పక రాయండి. సరైన సమాధానం రాసి ఎంపికైన ముగ్గురు పిల్లలకు **కొత్తపల్లి-80** ని బహుమతిగా పంపిస్తాం!

కొత్తపల్లి ప్రచురణలు, 1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101

తెలుసుకుందాం

సమాచారం

నయనతార సెహగల్



"భారత దేశంలో బ్రిటిషర్ల పరిపాలన నిజంగా ఒక అద్భుతం: దానికి మన వాతావరణంతో ఎలాంటి సంబంధం ఉండేది కాదు. ఆఫ్రికా తెగలవారికి తెల్లవాళ్ళు నైటీలు అలవాటు చేసినట్లు, ఈ బ్రిటిషర్లు మనకి మానసిక నైటీలని మప్పారు. చిన్నప్పుడు మా పుస్తకాల్ని ఆంగ్లేయుల పిల్లలకోసం, ఆంగ్లేయులే తయారుచేసేవాళ్ళు. ఆశ్చర్యం ఏమంటే మా బడిలో అందరం భారతీయులం, వాటినే చదివేవాళ్లం!"

అని రాసిన నయన్‌తార సెహగల్ ఆంగ్ల సాహిత్యంలో విశేష కృషి చేశారు. రాజకీయ దృక్పథం స్వేచ్ఛా సమానత్వాల్ని హరించేదిగా ఉండకూడదని ఉద్యమించి, మహిళల హక్కులకోసం, వారి సాధికారతకోసం గొప్ప కృషి చేశారు నయనతార. 1985 లో ఆవిడ రాసిన "రిచ్ లైక్ అజ్" పుస్తకానికి సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

"ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉన్నది. ఎవరి అభిప్రాయం పట్లా ప్రభుత్వం అసహనాన్ని ప్రదర్శించకూడదు. వారి మౌలిక హక్కుల్ని కాలరాయకూడదు" అంటూ తనకు ఇచ్చిన సాహిత్య అకాడమీ అవార్డును కొద్ది రోజుల క్రితమే వెనక్కి ఇచ్చేశారు నయనతార.

జవహర్ లాల్ నెహ్రూకి స్వయానా మేనకోడలైన నయనతార, తర్వాతి కాలంలో ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా అనేక రచనలు చేశారు. ప్రజలందరికి తమ అభిప్రాయాలను వెలువరించే హక్కు ఉండాలని, ఎలాంటి ప్రభుత్వమైనా ఎవ్వరి గొంతునూ అణచివేయకూడదని గట్టిగా చెబుతారు, 88 ఏళ్ల ఈ బామ్మగారు!

మన వారసత్వం

అమరావతి



ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని 'అమరావతి' కంటే ముందుగానే మనకు మరో గొప్ప అమరావతి ఉన్నది! గుంటూరు జిల్లాలో కృష్ణానది ఒడ్డున ఉన్న ఈ మండల కేంద్రానికి వేల సంవత్సరాల ఘన చరిత్ర ఉంది.

ప్రస్తుతం కేవలం పదకొండు వేల జనాభా ఉన్న ఈ గ్రామమే, ఒకప్పుడు 'ధాన్యకటకం అనే పేరు గల మహాపట్టణం' అంటే ఆశ్చర్యం వేస్తుంది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో 'జనపదం' పేరిట గణతంత్ర్య రాజ్యంగా ఉండిన ధాన్యకటకానికి ఆరోజుల్లో 16 కి.మీ చుట్టుకొలత ఉండేదట. ప్రసిద్ధ గ్రీకు రాయబారి "మెగస్తనీస్" ఆ రోజుల్లో అమరావతి కోట గురించి విశేషంగా రాశాడు. బుద్ధుని జీవితకాలంనుండి క్రీ.శ 14 వ శతాబ్దం వరకు కూడా అమరావతి ప్రసిద్ధ బౌద్ధక్షేత్రంగాను, విద్యాకేంద్రంగాను నీరాజనాలు అందుకుంది.

అంతగా వెలువొందిన అమరావతి ఆ తర్వాత 500 సంవత్సరాల పాటు చీకటిలో ఉండింది. దాని ప్రాశస్త్యతను అందరూ మరచే పోయారు, చివరికి, అక్కడ ఉన్న "దీపాలదిన్నె" అనే పెద్ద దిబ్బను త్రవ్వి, నిజానికి అది మహాద్భుతమైన బౌద్ధ స్తూపం అని, అందులో ఎవరో ఆచార్యుని అస్థికలు భద్రపరచి ఉన్నాయని కనుగొన్నాడు కల్నల్ కాలిన్ మెకంజీ. తర్వాత జరిపిన త్రవ్వకాలలో అద్భుతమైన ఈ చైత్యపు అవశేషాలేకాక, వేల సంవత్సరాలకు పూర్వపు శిలాజాలు కూడా దొరికాయి ఇక్కడ. ఇక్కడి శిల్పాల్లో కొన్నింటిని చెన్నై మ్యూజియంలో ఉంచారు. మరికొన్ని లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియానికి చేరుకున్నాయి. 'అమరావతిలోని అనేక పురాతన కట్టడాలు క్రీస్తుపూర్వం 5 వ శతాబ్దానికి చెందినవి' అని కార్బన్ డేటింగ్ ద్వారా కనుగొన్నారు.



Form IV

Statement about ownership and other particulars about newspaper **Kottapalli** :

1. Place pf publication: Kottapalli Prachuranalu, 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
2. Periodicity of publication: Monthly
3. Printer's Name : Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
4. Publisher's Name: Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
5. Editor's Name: Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
6. The Names and Addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one percent of the total capital:
   Dr. Samatha Potu, President, Satya- Foundation For A Healthy Society, 'Sri Krupa', Near Bus Stand, Chennoor, Adilabad District, Telangana State- 504201

I, Narayana Sarma G.V. hereby declaere that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: __26-08-2015__ **Signature Of the publisher:** Narayana

ORIGINAL

भारत सरकार
GOVERNMENT OF INDIA

भारत के समाचारपत्रों के पंजीयक का कार्यालय
OFFICE OF THE REGISTRAR OF NEWSPAPERS FOR INDIA

पंजीयन प्रमाण–पत्र
CERTIFICATE OF REGISTRATION

प्रमाणित किया जाता है कि प्रेस और पुस्तक पंजीकरण अधिनियम, 1867 के अन्तर्गत इस समाचारपत्र को पंजीकृत कर लिया है
This is to certify that this newspaper has been registered under the Press and Registration of Books Act, 1867 :

1. समाचार पत्र का नाम / Title of the Newspaper: KOTTAPALLI
2. समाचार पत्र की पंजीयन संख्या / Registration Number of the Newspaper: APTEL/2014/62705
3. भाषा/भाषाएं, जिसमें/जिनमें समाचारपत्र प्रकाशित किया जाता है / Language/Languages in which it is published: तेलुगु TELUGU
4. इसके प्रकाशन का नियतकाल तथा जिस दिन/दिनों/तिथियों को यह प्रकाशित होता है / Periodicity of its publication and the day/days/dates on which it is published: मासिक MONTHLY
5. समाचारपत्र की फुटकर कीमत / Retail selling price of the newspaper: Rs.25/-
6. प्रकाशक का नाम/Publisher's Name: NARAYANA SARMA G.V.
   राष्ट्रीयता/Nationality: INDIAN
   पता/Address: KOTTAPALLI PRACHURANALU, 1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH
7. मुद्रक का नाम/Printer's Name: NARAYANA SARMA G.V.
   राष्ट्रीयता/Nationality: INDIAN
   पता/Address: 1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH
8. सम्पादक का नाम/Editor's Name: NARAYANA SARMA G.V.
   राष्ट्रीयता/Nationality: INDIAN
   पता/Address: 1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH
9. जिस स्थान पर मुद्रण का काम होता है, उसका सही तथा ठीक विवरण / True and precise account at the premises where printing is conducted: MUDRICA QUALITY OFFSET PRINTERS SANYASI RAJU STREET OF GANDHI NAGAR, VIJAYAWADA, ANDHRA PRADESH
10. प्रकाशन का स्थान / Place of publication: KOTTAPALLI PRACHURANALU, 1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH

दिनांक /Date 18 JUN 2015

(एस. एम. खान S.M. KHAN)
भारत के समाचारपत्रों के पंजीयक
REGISTRAR OF NEWSPAPERS FOR INDIA

Owner(for reference):
KOTTAPALLI PRACHURANALU

ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొత్తపల్లి ప్రింటు పుస్తకాల వివరాలు:

క్రమ సంఖ్య	వివరాలు	ఒక సెట్ లోని పుస్తకాల సంఖ్య	స్టాకులో ఉన్న సెట్లు (సుమారుగా)	వెల (రూ) (పోస్టేజి 50 రూ. అదనం)
1	2011 Set	11	50	220
2	2012 Set	11	30	220
3	2013 Set	7	25	175
4	2014 Set	10	600	250
5	2015 Set	4	1400	100

వివరాలకోసం సంప్రతించండి:

కొత్తపల్లి ప్రచురణలు

1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర,

చెన్నేకొత్తపల్లి, అనంతపురము జిల్లా- 515101

Phone: 7702877670, 9000453887

Our Bank Account Details:
SB A/c : Kottapalli prachuranalu
A/c No: 62320333310
State Bank Of Hyderabad,
Dharmavaram Branch
IFSC: SBHY0020902

కొత్తపల్లి కథల పుస్తకాలను ఇంటర్నెట్లో పూర్తిగా ఉచితంగా చదవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు!

సందర్శించండి: http://kottapalli.in.   మెయిలు ద్వారా సంప్రతించండి: team@kottapalli.in

RNI Regn No. : APTEL/2014/62705

దాక్కున్న కథలు

అనగా అనగా ఒక దేశంలో చాలా కథలుండేవి.

ఆ దేశంలో కథలు రాని పిల్లాడే లేడు. కథలు రాని పాపే లేదు. కథలు చెప్పటం రాని అవ్వలు-తాతలు అస్సలు లేరు. గొప్ప సంగతేంటంటే, ఆ దేశంలో చెట్లు-పుట్టలు, కొండ-గాలి, వాగు-వంక, పురుగు-పిట్ట, బళ్ళు-వాహనాలు, తాళ్ళు-పేళ్ళు ఇట్లాంటివన్నీ కూడా మా చక్కని కథలు చెప్పేవి. అక్కడ కథలు ఎన్ని కుప్ప పడ్డాయంటే, ఏ వైపున త్రవ్వినా లెక్కలేనన్ని కథలు దొరికేవి.

అయితే ఒకసారి ఆ దేశానికి ఎవరో మాంత్రికుడు వచ్చాడు. వాడు అసలు ఎక్కడినుండి వచ్చాడో, ఎన్నాళ్ళుంటాడో, మళ్ళీ ఎటు వెళ్తాడో ఎవ్వరికీ తెలీదు. ఈ దేశానికి రాగానే వాడు తనకు కనబడిన కథనల్లా కొనేసుకోవటం మొదలు పెట్టాడు. అందరికీ ఇది బలే అనిపించింది- చాలా వింత విషయం కదా, ఆ రోజుల్లో, కథలు కొనటం, అమ్మటం?! అలా అవ్వలు-తాతలు, అమ్మలు-నాన్నలు అందరూ వాడికి కథలు అమ్మేందుకు పోటీ పడ్డారు. కొందరు పనిలేనివాళ్ళైతే ఎక్కడెక్కడో ఉన్న కథల్ని కూడా త్రవ్వి త్రవ్వి అమ్మేశారు వాడికి. అక్కడినుండి వాడు పిల్లల దగ్గరికి వచ్చాడు కథల్ని ఇచ్చెయ్యమంటూ.

అయితే ఆ సరికల్లా దేశంలో ఉన్న పిల్లలతో పాటు గాలీ-నీళ్ళు, గొడ్డు-గోదా, చెట్టూ-చేమా, వాగూ-వంకా, దిక్కులు-దుమ్ము-దుశానం- ఇవన్నీ జరుగుతున్న మోసాన్ని పసిగట్టాయి. ఏమంటే, ఒకసారి మాంత్రికుడి సంచీలోకి వెళ్ళిపోయిన కథలు- ఇంక వెనక్కి రానే రావు!

దాంతో ఆ దేశంలోని పిల్లలు- వాళ్ళతోబాటు గాలీ-గోదా అన్నీ కూడా, వేటికవి- తమ దగ్గరున్న కథల్ని ఎవరికీ కనబడకుండా దాచేసుకున్నాయి.

కొన్నాళ్ళు అలా తిరిగిన తర్వాత, మాంత్రికుడేమో తను కొనుక్కున్న కథలతో మాయమైపోయాడు! అందరూ గోడు గోడు మన్నారు. కానీ ఏం లాభం? అమ్ముడుపోయిన కథలు ఇంక వెనక్కి రానే లేదు. ఇక మిగిలిన కథలేమో, మరి ఎవ్వరికీ కనబడకుండా దాక్కున్నాయాయె!

ఇన్నేళ్ల తర్వాత, మళ్ళీ ఇదిగో- అట్లా మిగిలిన కథల్లో కొన్ని అందాయి కొత్తపల్లికి. మేం ఈ కథల్ని స్వేచ్ఛగా పంచటం మొదలెట్టాం. వీటిని మీరూ అందుకోండి; మళ్ళీ పంచండి. స్వేచ్ఛగా ఉంచండి. మీ దగ్గరున్న కథల్నీఅంతే- వాటిని ఎంతమందితోటైనా పంచుకోండి; ఎందరికైనా చెప్పండి; స్వేచ్ఛగా ఉంచండి; తప్ప ఏనాడూ అమ్ముకోకండి.

ఎందుకంటే, కథల తీరే అది- ఓసారి మాంత్రికుడి సంచీలోకి వెళ్ళిపోయాయంటే ఇక అవి వెనక్కి రానే రావు మరి!

Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu, printed at Mudrica Offset Printers, Vijayawada and published at “Kottapalli”, 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma